
సోమవారం 23.03.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 | సంచిక - 335 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

రాష్ట్రంలో అలర్లు, అశాంతి రేకెత్తించేలా జగన్ ముఠా కుట్రలు చేస్తున్నారు.5 ఏళ్ల వైసీపీ అరాచక పాలన తర్వాత ప్రజలు ఇప్పుడు ప్రశాంతంగా జీవిస్తున్నారు. అది చూసి ఓర్వలేకపోతున్న వైసీపీ నేతలు విద్వేషాలు రెచ్చగొట్టి అశాంతిని నెలకొల్పాలని చూస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి జగన్ వైరస్‌లా మారారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



# మోదీకి అరుదైన రికార్డు

## అత్యధిక కాలం ప్రభుత్వాధినేతగా చరిత్ర సృష్టి

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్‌ఫైల్) :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో చారిత్రాత్మక రికార్డును నెలకొల్పారు. గుజరాత్ ముఖ్యమంత్రి నుంచి దేశ ప్రధానిగా వరుసగా 8,931 రోజుల పాటు ఎలాంటి విరామం లేకుండా ప్రభుత్వాధినేతగా కొనసాగుతూ చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న రికార్డును అధిగమించి దేశ రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించారు.

**చామ్లింగ్ రికార్డు అధిగమనం :** దేశంలో అత్యధిక కాలం ప్రభుత్వాధినేతగా కొనసాగిన నేతగా ఇప్పటివరకు పవన్ కుమార్ చామ్లింగ్ పేరుంది. ఆయన సిక్కిం రాష్ట్రానికి వరుసగా 8,930 రోజుల పాటు ముఖ్యమంత్రిగా సేవలందించారు. అయితే మార్చి 22 నాటికి మోదీ 8,931 రోజుల మైలురాయిని చేరుకుని ఆ రికార్డును అధిగమించారు. ముఖ్యంగా సీఎంగా, ప్రధానిగా నిరవధికంగా కొనసాగడం ఈ రికార్డుకు మరింత ప్రాముఖ్యతను తీసుకొచ్చింది.

**గుజరాత్ నుంచి జాతీయ నాయకత్వం వరకు :** 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ, రాష్ట్రాన్ని సంక్షోభ పరిస్థితుల నుంచి బయటకు తీసుకువచ్చే దిశగా పలు సంస్కరణలు చేపట్టారు. నాలుగు దఫాల్లో సీఎంగా సేవలందిస్తూ పరిశ్రమలు, వ్యవసాయం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి పునాది వేశారు.

2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా అదే దూకుడు కొనసాగిస్తూ జాతీయ స్థాయిలో పరిపాలనను ముందుకు తీసుకెళ్తున్నారు.

**ప్రధానిగా చారిత్రాత్మక విజయాలు :** ప్రధాని హోదాలో కూడా మోదీ అనేక రికార్డులను సృష్టించారు. స్వాతంత్ర్యానంతరం జన్మించి దీర్ఘకాలం ప్రధానిగా కొనసాగుతున్న తొలి కాంగ్రెసేతర నేతగా నిలిచారు. అలాగే రెండు పూర్తి పదవీకాలాలు పూర్తి చేసి మూడోసారి అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెసేతర నాయకుడిగా గుర్తింపు పొందారు. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగుతున్న రెండో నాయకుడిగా కూడా నిలిచారు.

**అత్యధిక కాలం సీఎంగా మరో రికార్డు:** గుజరాత్ రాష్ట్రానికి అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన రికార్డు కూడా మోదీ పేరిటే ఉంది. నాలుగు దఫాల్లో ఆయన పాలన రాష్ట్ర అభివృద్ధికి కీలకంగా నిలిచిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రిగా అత్యధిక అనుభవం కలిగిన ప్రధానిగా కూడా మోదీ ప్రత్యేక గుర్తింపు పొందారు.

**ప్రజా సేవలో నిరంతర ప్రయాణం :** ప్రభుత్వాధినేతగా 25వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మోదీ తన రాజకీయ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. గుజరాత్‌లో బాధ్యతలు చేపట్టిన సమయంలో రాష్ట్రం భూకంపం, కరువు, రాజకీయ అస్థిరత వంటి సవాళ్లను ఎదుర్కొంటోందని తెలిపారు. ఆ పరిస్థితుల్లో రాష్ట్ర పునర్నిర్మాణమే తన లక్ష్యంగా పెట్టుకుని పనిచేశానని చెప్పారు.

**అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి :** తన పాలనలో పేదల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు మోదీ పేర్కొన్నారు. కోట్లాది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చినట్లు తెలిపారు. మహిళల సాధికారత, యువతకు అవకాశాలు, రైతుల అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేసినట్లు చెప్పారు.భారత్‌ను ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

మిగతా 2లో...

- **ఎలాంటి విరామమూ లేకుండా ప్రభుత్వాధిపతిగా 8,931 రోజులు**
- **2001 నుంచి 2014 మధ్యకాలంలో నాలుగుసార్లు గుజరాత్ సీఎంగా సేవలు**
- **2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయాల్లో మోదీ పాత్రే కీలకం**

# అప్పుడు ఐటీ... ఇప్పుడు క్వాంటం



- **నాలెడ్జి ఎకానమీని ఊహించే ఐటీకి ప్రోత్సాహం**
- **ప్రాజెక్టుల నిర్వహణలో పీపీపీలది సక్సెస్ ఫార్ములా**
- **యువ పారిశ్రామికవేత్తలకు ఏపీ స్వాగతం**
- **ఈఓ సౌత్ ఏషియా లెర్నింగ్ సమ్మిట్- 2026లో సీఎం**

**హైదరాబాద్ (జర్నలిస్ట్‌ఫైల్) :** మూడు దశాబ్దాల క్రితం చేసిన విజన్ ఇప్పుడు ప్రతిఫలాలను ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. గతంలో అమలు చేసిన ఐటీ, టెక్నాలజీ, విద్యుత్ సంస్కరణలు ఇప్పుడు ప్రయోజనాలను దక్కేందుకు కారణమవుతున్నట్టు ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లో ఈవో సౌత్ ఏషియా లెర్నింగ్ సమ్మిట్ 2026, ట్రాన్స్ ఫార్మింగ్ ఏఐ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సులో ది ఫ్యూచర్ ఆఫ్ ఎవ్రీథింగ్ అనే అంశంపై సీఎం అభిప్రాయాలను పంచుకున్నారు. నాలెడ్జి ఎకానమీదే భవిష్యత్తు అని ఆలోచన చేసి టెక్నాలజీని ప్రోత్సహించి ఐటీని అందిపుచ్చుకున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా ఉన్న అప్పటి ఉమ్మడి ఏపీని పారిశ్రామిక రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే ఆర్థిక సంస్కరణల్ని అందిపుచ్చుకున్నామన్నారు. ఐటీకి ఇచ్చిన ప్రోత్సాహం కారణంగానే బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలను వదిలి మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ లోకి అడుగుపెట్టిందన్నారు. ఐఎస్ బీ, జీనోమ్ వ్యాలీ లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు వచ్చాయన్నారు. గతంలో తీసుకున్న నిర్ణయాల వల్లే ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలూ ఫార్మా రంగంలోనూ నెంబర్ వన్‌గా ఉన్నాయన్నారు. కరోనా సమయంలోనూ ప్రపంచానికి హైదరాబాద్ లోని జీనోమ్ వ్యాలీ వ్యాక్సిన్ అందించిందన్నారు. రాజకీయ కారణాల వల్ల ఏపీ రెండు రాష్ట్రాలుగా విడిపోయినా గతంలో తీసుకువచ్చిన సంస్కరణలు తెలుగు ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచాయన్నారు.

ఇప్పుడు ఇక క్వాంటం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్స్ లాంటి భవిష్యత్ టెక్నాలజీలతో రాష్ట్రంలో సుపరిపాలన అందించేలా కార్యాచరణ చేస్తున్నామని అన్నారు. గ్రీన్ హైడ్రోజన్ గ్రీన్ అమ్మోనియా లాంటి రంగాలు విద్యుత్ రంగాన్ని శాసిస్తాయని సుస్థిర విద్యుత్ ఉత్పాదనతో విద్యుత్ ఛార్జీలు పెంచాల్సిన అవసరం రాబోదన్నారు. ప్రస్తుతం యుద్ధ ప్రభావం నేపథ్యంలో ఎల్పీజీ కొరత ఏర్పడిందని ఈ కారణంగానే పైప్డ్ నాచురల్ గ్యాస్ సరఫరా కీలకంగా మారిందన్నారు. యుద్ధానంతర పరిస్థితుల రీత్యా వివిధ అంశాల్లో మనల్ని మనం సర్దుబాటు చేసుకోవాల్సిన అంశాలు తలెత్తాయన్నారు.

మిగతా 2లో...

# మోదీ సుదీర్ఘ సేవా కాలం చారిత్రాత్మక మైలురాయి



- **ప్రధాని మోదీ అరుదైన రికార్డు.. అభినందనలు తెలిపిన పీవీఎన్ మాధవ్**
- **దేశానికి స్థిర నాయకత్వం అందించిన మోదీ**

**అమరావతి(జర్నలిస్ట్‌ఫైల్) :** దేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రభుత్వాధిపతిగా సేవలందించిన నాయకుడిగా నరేంద్ర మోదీ నిలవడం విశేషమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మోదీకి అభినందనలు తెలిపారు.

ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి హోదాల్లో కలిపి 8,931 రోజులపాటు నిరంతర సేవలందించడం అరుదైన ఘనతగా అభివర్ణించారు. ఈ సుదీర్ఘ ప్రయాణం ప్రజల విశ్వాసానికి ప్రతిబింబమని, సమర్థమైన నాయకత్వానికి నిదర్శనమని తెలిపారు.

వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టడం మోదీపై దేశ ప్రజల నమ్మకాన్ని స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. సాధారణ కుటుంబం నుంచి ఎదిగి దేశాన్ని నడిపించడం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.

మోదీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం సమన్వయం సాధించబడిందని, మౌలిక వసతుల అభివృద్ధి, సాంకేతిక రంగంలో పురోగతి,

మిగతా 2లో...

# పశుసంవర్ధక రంగానికి భారీ ఊరట



- **పట్టణాల్లో పశుపోషకులకు అభివృద్ధి ఛార్జీల నుంచి మినహాయింపు**
- **భవన అనుమతుల రుసుములో సడలింపు**
- **మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి**

**అమరావతి(జర్నలిస్ట్‌ఫైల్) :** రాష్ట్రంలో పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేస్తూ పశుపోషకులు, చిన్న రైతులకు పెద్ద ఎత్తున ఊరటనిచ్చే నిర్ణయం తీసుకున్నామని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పురపాలక పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ జారీ చేసిన జీవో ప్రకారం

మిగతా 2లో...

# రాష్ట్రంలో ప్రతిరోజూ పండుగే..



- **అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం**
- **ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీలకు ప్రాధాన్యం**
- **బీసీలకు ఆర్థిక, రాజకీయ గుర్తింపు టీడీపీతోనే...**
- **బీసీ రక్షణ చట్టం తుది ముసాయిదా సిద్ధం**
- **త్వరలోనే చట్టానికి తుది రూపు**
- **జగన్ హయాంలో బీసీల హక్కులు భూ స్థాపితం : మంత్రి సవిత ధ్వజం**
- **నూజివీడులో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు సవిత, కొలుసు పార్థసారథి**

**నూజివీడు (జర్నలిస్ట్‌ఫైల్) :** సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రంలో ప్రతి రోజూ పండగేనని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ఆనందం వెలిబుచ్చారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. వడ్డెర్లను ఎస్టీలో చేర్చే విషయమై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో ఆదివారం జరిగిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బ్రిటీషర్ల దాష్టీకాలను ఎదిరించి... మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన యోధుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. ఓబన్న చేసిన పోరాటాన్ని ముందు తరాలకు తెలియజేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించారన్నారు. దీనిలో భాగంగా ఓబన్న జయంతిని అధికారికంగా, రాష్ట్ర పండుగగా నిర్వహించాలని

మిగతా 2లో...

# శత్రు నౌకలు మినహా అన్నీ వెళ్లొచ్చు! - ఇరాన్



**ఢిల్లీ (జర్నలిస్ట్‌ఫైల్) :** హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాల్సిందేనని, లేదంటే విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ స్పందించింది. శత్రు దేశాలకు చెందినవి మినహా అన్ని నౌకలు తమతో సమన్వయం చేసుకుంటూ హర్మూజ్ ద్వారా వెళ్లొచ్చని పేర్కొంది. ఈ మేరకు ఐరాసలోని ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంవో)లో ఇరాన్ సీనియర్ ప్రతినిధి అలీ మౌసావి ఈ విషయాన్ని వెల్లడించారు.

హర్మూజ్‌లో ప్రస్తుత పరిస్థితికి అమెరికా, ఇజ్రాయెల్‌లు ప్రధాన కారణమని మౌసావి ఆరోపించారు. దౌత్యానికి ఇరాన్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, అయినప్పటికీ.. దురాక్రమణ నిలిపివేయడం, పరస్పర విశ్వాసం ఎంతో ముఖ్యమన్నారు. నావికుల రక్షణ, సముద్ర భద్రతను మెరుగుపరచడానికి ఐరాస విభాగమైన ఐఎంవోకు సహకరించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందన్నారు. ఇదిలాఉంటే, హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవకుంటే.. ఇరాన్‌లోని పలు విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. అతిపెద్ద విద్యుత్ కేంద్రంతోనే ఈ దాడులు ఆరంభిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ స్పందన రావడం గమనార్హం.

2లో...

# ఏపీ పారిశ్రామిక రంగంలో గొప్ప ముందడుగు

- **ఫలితాలను ఇస్తోన్న 21 నెలల కూటమి ప్రభుత్వ ప్రయత్నాలు**
- **అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా పరిశ్రమకు శంకుస్థాపన**
- **కేంద్రమంత్రులతో కలిసి ఈనెల 23న సీఎం చంద్రబాబు భూమిపూజ**
- **రూ.1,35,964 కోట్ల పెట్టుబడి - ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షమందికి ఉద్యోగావకాశాలు**
- **ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం**



**అమరావతి(జర్నలిస్ట్‌ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధిలో మరో చారిత్రాత్మక అడుగు పడుతోంది. ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా) సంస్థ 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రాష్ట్రంలో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పడానికి సిద్ధమైంది. దీనికి ఈనెల 23న అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో కేంద్రమంత్రులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమిపూజ చేయనున్నారు. రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్షమందికి ఉద్యోగ,

మిగతా 2లో...

## మోదీకి అరుదైన రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

**"వికసిత భారత్" లక్ష్యం :** దేశ రాజ్యాంగ విలువలను కాపాడుతూ "వికసిత భారత్" లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని మోదీ తెలిపారు. ప్రజల విశ్వాసమే తనకు బలమని, అదే తన సేవా ప్రయాణానికి ప్రేరణగా నిలుస్తుందని చెప్పారు.

**ఎన్నికల విజయాల్లో మోదీ ప్రభావం :** 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయాల్లో మోదీ నాయకత్వం కీలకంగా నిలిచింది. ఆయన నాయకత్వం పార్టీకి దేశవ్యాప్తంగా బలమైన స్థానం కల్పించిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా, సీఎంగా ప్రారంభమైన మోదీ రాజకీయ ప్రయాణం ప్రధానిగా కొనసాగుతూ అరుదైన రికార్డులతో చరిత్రలో నిలిచిపోతుండడం విశేషం.

## మోదీ సుదీర్ఘ సేవా కాలం చారిత్రాత్మక మైలురాయి

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రతిష్ఠ పెరగడం వంటి అంశాలు దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయని వివరించారు.

'వికసిత భారత్-2047' లక్ష్యంతో దేశం అభివృద్ధి దిశగా వేగంగా సాగుతోందని, ఆ లక్ష్య సాధనలో ప్రతి వర్గం భాగస్వామ్యం కావాలని పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. మోదీ సుదీర్ఘ సేవా కాలం దేశ భవిష్యత్తుకు బలమైన పునాది వేసిందని ఆయన పేర్కొన్నారు.

## పశుసంవర్ధక రంగానికి భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలు, పట్టణ అభివృద్ధి సంస్థలు పరిధిలో డెయిరీ ఫారాలు, గొర్రెలు/మేకల పెంపకం కేంద్రాలు, పందుల పెంపకం యూనిట్లు, ఇతర పశుసంవర్ధక ఫారాలకు బెటర్‌మెంట్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీల నుండి పూర్తిగా మినహాయింపు మంజూరు చేయబడిందని తెలిపారు. అదేవిధంగా ఈ ఫారాలకు భవన అనుమతి/లైసెన్స్ రుసుమును గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే రుసుముకు సమానంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడిన రైతులు, చిన్న వ్యవసాయదారులకు ఆర్థిక భారం గణనీయంగా తగ్గి వారి జీవనోపాధి మెరుగుపడుతుందని, మరింత మందికి స్వయం ఉపాధి, సంవృద్ధి లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. గత జూన్ నెలలో జరిగిన సీఎం కాంక్లేవ్ మీటింగ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## శత్రు నౌకలు మినహా అన్నీ వెళ్లొచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

**వారి నిస్సహాయతకు నిదర్శనం :** అమెరికా బెదిరింపులపై ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ స్పందించారు. "ప్రపంచపటం నుంచి ఇరాన్‌ను తుడిచివేయాలనే వారి భ్రమ.. నిస్సహాయత, నిరాశకు నిదర్శనం. బెదిరింపులు, ఉగ్రవాదం అనేవి ఇరాన్ ప్రజలను మరింత ఏకం చేస్తాయి. ఇరాన్ భూభాగంపై దురాక్రమణకు పాల్పడే వారికి మినహా అన్ని దేశాలకు హర్మూజ్ జలసంధి తెరచే ఉంటుంది" అని పేర్కొన్నారు.

## పదవీ విరమణ వయస్సు పెంపు, జాబ్ క్యాలెండర్‌పై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం హర్షం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గురుకుల సొసైటీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ సిబ్బంది పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ తీసుకున్న నిర్ణయాన్ని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం స్వాగతించింది. ఈ నిర్ణయానికి సంబంధించి త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడనున్నాయని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలుగా అమలులో ఉండగా, గురుకుల సిబ్బందికి కూడా ఇదే నిబంధన వర్తింపజేయడం సముచితమని సంఘం అభిప్రాయపడింది.

అదేవిధంగా నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడాన్ని కూడా సంఘం అభినందించింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయాలు ఉద్యోగులు, నిరుద్యోగులకు మేలు చేస్తాయని వారు పేర్కొన్నారు.

## వర్గీకరణ చట్టం లోపభూయిష్టం



- **హైకోర్టు న్యాయవాది చిలువూరు నాగరాజు**

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** వర్గీకరణ చట్టం, అందులోని రోష్టర్ విధానం లోపభూయిష్టంగా ఉందని,చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కూటమి ప్రభుత్వం మాల సామాజిక వర్గం దోపిడీకి చట్టబద్ధత కల్పించే విధంగా ఉందని ఇప్పటికైనా ప్రభుత్వం,సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ప్రకారం వర్గీకరణలో సరవరణలు చేయాలని, ఎమ్ఆర్ పిఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య నాయకత్వంలో పనిచేస్తున్న, ఎమ్ఆర్ పిఎస్ రాష్ట్ర కోకన్వీనర్ ఉన్నం ధర్మారావు, హైకోర్టు న్యాయవాది చిలువూరు నాగరాజు మీడియా ముందు పేర్కొన్నారు.

స్థానిక ఎమ్ఆర్ పిఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉన్నం ధర్మారావు మాట్లాడుతు వర్గీకరణ విషయంలో, లోపాలపై, హైకోర్టు లో పిల్ వేసిన న్యాయవాది చిలువూరు నాగరాజును అభినందిస్తున్నామన్నారు. మందాకృష్ణ వర్గీకరణ పోరాటాల పేరుతో మాదిగలను దోచుకున్నాడని ఆరోపించారు. వర్గీకరణ చట్టం చేసిన రాష్ట్ర కూటమి ప్రభుత్వం మాదిగ సమాజానికి న్యాయం చేయకుండా, రోష్టర్ పద్ధతిలో మాలలకు న్యాయం జరిగేలా వ్యవహరించిందని ఆరోపించారు. న్యాయవాది చిలువూరు నాగరాజు మాట్లాడుతు వర్గీకరణ విధానం న్యాయబద్ధంగా లేదని, రోష్టర్ విధానం 3వ, విభాగంలో, మాదిగ సామాజిక వర్గం నష్టపోయేలా, మాల సామాజిక వర్గం దోపిడికి చట్టబద్ధత కల్పించినట్లుందని ఆరోపించారు. ఈవిషయంపై మంద కృష్ణ బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షులు కిన్నెర నాగరాజు మాట్లాడుతు వర్గీకరణ లోపభూయిష్టమని, హైకోర్టులో పిల్ వేసి, హైకోర్టు నుండి అనుకూల స్పందన వచ్చేలా తమ వాదనలు వినిపించిన, న్యాయవాది నాగరాజుకు అభినందనలు తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 25న, నెల్లూరులో ఉసురుపాటి బ్రహ్మయ్య నాయకత్వంలో రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నట్లు, మాదిగ సంఘీయులంతా తరలి రావాలన్నారు. ఈమీడియా సమావేశంలో తెనాలి బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

# అప్పుడు ఐటీ... ఇప్పుడు క్వాంటం

(మొదటి పేజీ తరువాయి)



దక్షిణ భారత్ లోనే గ్రీన్ ఇంధనం ఉత్పత్తిలో ఏపీ అగ్రస్థానంలో ఉంటుందన్నారు. ప్రస్తుతం ఏఐ లాంటి టెక్నాలజీ ద్వారా తిరుమల లాంటి పుణ్యక్షేత్రాల్లో దర్శనాల కోసం వేచి ఉండే సమయాన్ని కుదించగలిగామని వేగంగా దర్శనాలు చేయించే సామర్ధ్యాన్ని 15 నుంచి 20 శాతానికి పెంచగలగామన్నారు. ఆధునిక ల్యాబ్ ద్వారా ప్రసాదం తయారీలో వినియోగించే పదార్థాలను నిత్యం పర్యవేక్షిస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతంలో లా కల్తీ నెయ్యి వినియోగించేందుకు ఇక ఆస్కారం ఉండబోదన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని నిరంతరం తెలుసుకునేలా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపోందిస్తున్నామన్నారు. త్వరలో ఏఐ డాక్టర్ సేవలతో పాటు రైతులకు ఉపకరించేలా ఏఐ అగ్రానమిస్ట్ సేవలు అందించబోతున్నామన్నారు.

**యువపారిశ్రామిక వేత్తలకు ఏపీ స్వాగతం :** పాలనలో ఇవాళ తీసుకున్న నిర్ణయాలన్నీ రేపటికి చరిత్ర అవుతాయని..గతంలో తీసుకున్న స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు ఫలితాలు ఇచ్చాయన్నారు. ప్రస్తుతం అమరావతిని టెక్నాలజీ అనుసంధానించి స్మార్ట్ సిటీగా బ్లూ గ్రీన్ రాజధానిగా నిర్మిస్తున్నామని అన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామని అన్నారు. గోదావరిలో వచ్చే 50 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రాజెక్టు పూర్తి అయితే ఇతర రాష్ట్రాలకు కూడా ప్రయోజనాలు కలిగేలా చేయవచ్చన్నారు. ఏపీలో మూడు రీజియన్లుగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతున్నామన్నారు. అమరావతిలో త్వరలోనే క్వాంటం కంప్యూటర్ పనిచేయటం ప్రారంభిస్తుందని సీఎం వివరించారు. త్వరలోనే క్వాంటం కంప్యూటర్ తయారీకి అవసరమైన పరికరాల తయారీ కూడా చేసేలా ప్రణాళికలు చేశామన్నారు. ఇప్పుడు గూగుల్ విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు చేయబోతోందని.. రిలయన్స్ కూడా డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. 2047 స్వర్ణాంధ్ర ద్వారా రాష్ట్రాభివృద్ధికి విజన్ రూపకల్పన చేశామన్నారు. వ్యవసాయం, సేవల రంగం, పారిశ్రామిక రంగం అభివృద్ధికి వీలుగా ప్రణాళికలు రూపొందించుకున్నామని వివరించారు. ఉద్యాన, ఆక్వా రంగాల్లో కూడా ఎగుమతుల ద్వారా వృద్ధి సాధించేలా చర్యలు చేపట్టామని వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో యువ పారిశ్రామిక వేత్తల అవసరం చాలా ఉందని..దీనిని అందిపుచ్చుకోవాలని కోరుతున్నానని సీఎం అన్నారు. ఏపీని దేశంలోనే అగ్రస్థాయి ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేలా విజన్ డాక్యుమెంట్ రూపోందించామని..15 శాతం వృద్ధి రేటు నిలకడగా కొనసాగేలా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

**పీపీపీలది సక్సెస్ ఫార్ములా :** ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకుంటూ పీపీపీ విధానంలో చేపట్టిన జేగూరుపాడు విద్యుత్ ప్రాజెక్టు చేపట్టామని సీఎం వెల్లడించారు. 30 ఏళ్ల తర్వాత ఆ ఆస్తి మళ్లీ ప్రభుత్వానికి తిరిగివచ్చిందని సీఎం అన్నారు. చాలా రంగాల్లో ఇదే సక్సెస్ ఫార్ములాగా మారిందన్నారు. భారత్ లో చేపట్టిన గోల్డెన్ క్వాడ్రిలేటరల్ రోడ్లు, ఎయిర్ పోర్టులు ఇలా వేర్వేరు ప్రాజెక్టులు విజయం సాధించాయన్నారు. వేర్వేరు సంస్కరణల ఫలితంగా సంపద పెరిగిందని .. అదే సమయంలో సమాజానికి వెనక్కు తిరిగి ఇవ్వాలన్న ఆలోచన ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గిరిజనులు పండించే అరకు కాఫీని మార్కెటింగ్ చేసేందుకు గతంలో నాందీ ఫౌండేషన్ ఏర్పాటు చేశామని.. ఇప్పుడు దానిని ప్రపంచ వ్యాప్తంగా ప్రమోట్ చేసే బాధ్యతను ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా తీసుకున్నారని వెల్లడించారు. సమాజంలో అట్టడుగున ఉండిపోయిన పేదవారిని ఆదుకునేందుకు పీ4 ఎంబీకే 10-20 కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. పేదలకు చేయూత అనేది చాలా కీలకమని తద్వారా వారు సామాజికంగా ఆర్థికంగా పైకి ఎదగగలుగుతారని సీఎం వివరించారు. వివిధ దేశాల్లో వయోవృద్ధుల సంఖ్య పెరుగుతోందని ..2047 తర్వాత భారత్ లోనూ ఇదే సమస్య వచ్చే అవకాశం ఉందని సీఎం అన్నారు. దక్షిణ భారత్ లోనూ ఫెర్టిలిటీ రేటు పెరిగేలా చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. అందుకే పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ ద్వారా ప్రోత్సాహం కల్పించాలని నిర్ణయించామన్నారు.

**గత పాలనలో అంతా విధ్వంసమే :** 2024లో మళ్లీ తాము అధికారంలోకి వచ్చే సమయానికి ఏపీ అంతా సర్వనాశనం అయ్యిందని..గత పాలకులు ఐదేళ్ల పాలనా కాలంలో బ్రాండ్ పోయిందని.. వ్యవస్థలు సర్వనాశనం అయ్యాయని వివరించారు. రాష్ట్ర విభజన కంటే దారుణగా రాష్ట్ర పరిస్థితి తయారైందని అన్నారు. ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చిందని .. అయితే 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక కొన్ని ప్రోగ్రెసివ్ నిర్ణయాలు తీసుకుని సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన చేస్తున్నామని వివరించారు. ప్రస్తుతం పెట్టుబడుల్ని ఆకర్షించటంలో ఏపీ అగ్రస్థానంలో ఉందని వివరించారు. గతంలో అమరావతి నిర్మాణం జరుగుతుండగా గత పాలకులు శ్మశానం అని గేలి చేసి విధ్వంసం చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ దానిని పునర్నిర్మిస్తున్నామని అన్నారు. పోలవరం ప్రాజెక్టును కూడా 2019 వరకూ 72 శాతం పనులు పూర్తి చేశామని గత పాలకులు పట్టించుకోక విధ్వంసం చేశారన్నారు. రూ.440 కోట్లతో నిర్మించిన దయాఫ్రాం వాల్ ధ్వంసం అయ్యిందని .. మళ్లీ అదే పనిని రూ. వెయ్యి కో ట్లతో చేపట్టాల్సి వచ్చిందన్నారు.

**సమ్మిట్ లో చంద్రబాబు విజన్ ప్రజెంటేషన్ :** ఈఓ సౌత్ ఏసియా లెర్నింగ్ సమ్మిట్ 2026లో హైదరాబాద్ ను హైటెక్ సిటీగా మలిచిన తీరుపై నిర్వాహకులు వీడియోను ప్రదర్శించారు.

ఉమ్మడి రాష్ట్రంలో ప్రపంచ ఐటీ కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దటంలో చంద్రబాబు విజన్ ను నిర్వహాకులు ఈ వీడియోలో ప్రదర్శించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ను 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా మార్చేందుకు ప్రణాళికలు చేస్తున్నారంటూ దాంట్లో పేర్కోన్నారు. 1995 నుంచి హైటెక్ సిటీ నిర్మాణం, జీనోమ్ వ్యాలీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మైక్రోసాఫ్ట్ లాంటి కంపెనీల రాక లాంటి అంశాలను ప్రస్తావిస్తూ వీడియో ప్రదర్శించారు. ప్రస్తుతం క్వాంటం వ్యాలీ, ఏఐ పై ఏపీ ఫోకస్ పెట్టిందంటూ ఇచ్చిన ప్రజెంటేషన్ సౌత్ ఏసియా లెర్నింగ్ సమ్మిట్ కు హాజరైన పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకట్టుకుంది.

# రాష్ట్రంలో ప్రతిరోజూ పండుగే..

(మొదటి పేజీ తరువాయి)



శాశ్వత జీవో జారీచేశారన్నారు. గత సంవత్సరం గుంటూరులో, ఈ ఏడాది అనంతపురంలో ఓబన్న జయంతిని అధికారికంగా జరుపుకున్నామన్నారు. నూజివీడులో వడ్డే ఓబన్న విగ్రహం ఆవిష్కరించడం అభినందనీయమని మంత్రి సవిత కొనియాడారు.

**ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీలకు ప్రాధాన్యం :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సవిత తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిందన్నారు. ఉగాది సందర్భంగా నిరుద్యోగ యువతకు మంత్రి నారా లోకేశ్ శుభవార్త చెబుతూ, జాబ్ క్యాలెండర్ విడుదల చేశారన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పథకాలతో ఎక్కువగా లబ్ధి పొందేది బీసీలేనని మంత్రి స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రంలో ప్రతి రోజూ పండుగ వాతావరణమే ఉంటోందన్నారు. బీసీలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వాలవేనన్నారు. బీసీ రక్షణ చట్టం తుది ముసాయిదా సిద్ధమైందని, త్వరలోనే ఈ చట్టాన్ని అమలు చేయనున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు కేబినెట్ లో ఎనిమిది మంది బీసీ మంత్రులకు కీలక శాఖలు అప్పగించారన్నారు. కేంద్రమంత్రిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన కింజరాపు రామ్మోహననాయుడికి అవకాశమిచ్చారన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజక వర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, వాటిలో బీసీలకు ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు.

**వడ్డెర్లకు చంద్రన్న వెన్నుదన్ను:** వడ్డెర్ల సామాజిక వర్గీయులకు అన్నివిధాలా సీఎం చంద్రబాబు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. వడ్డెరలకు మైనింగ్ లీజుల్లో 15 శాతం రాయితీ కల్పించామన్నారు. వడ్డెరలకు మైనింగ్ లీజు రిజర్వేషన్లు రద్దు చేసిన ఘనుడు జగన్ అని విమర్శించారు. వడ్డెర్లను ఎస్టీల్లో చేర్చే విషయమై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

**జగన్ హయాంలో బీసీల హక్కులు భూ స్థాపితం :** అనంతరం తనను కలిసిన విలేకర్లతో మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి మంత్రి సవిత మాట్లాడారు. బీసీల అభ్యున్నతి కోసం అన్న ఎన్టీఆర్ విశేష కృషి చేశారన్నారు. బీసీలకు సీఎం చంద్రబాబు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. జగన్ హయాంలో బీసీల హక్కులు భూ స్థాపితమయ్యాయన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించి శభాష్ అనిపించుకున్న మంత్రి నారా లోకేశ్ త్వరలో మరో డీఎస్సీ నిర్వహించడానికి సిద్ధమవుతున్నారన్నారు. మహిళల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. దీపం 2, స్త్రీ శక్తి, తల్లికి వందనం వంటి ఎన్నో పథకాలు అమలుచేసి, మహిళా పక్షపాతినని సీఎం చంద్రబాబునాయుడు నిరూపించుకున్నారన్నారు. జగన్ మాత్రం అందుకు విరుద్ధంగా ఆస్తుల కోసం తల్లిని, చెల్లిని కోర్టుకు ఈడ్చారని మంత్రి సవిత మండిపడ్డారు.

అంతకుముందు నూజివీడుకు వచ్చిన మంత్రి సవితకు కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. భారీ ర్యాలీ నిర్వహించి, గజమాలతో సత్కరించి అడుగడుగునా బ్రహ్మరథం పట్టాయి. మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి స్వాతంత్ర సమర యోధుడు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని మంత్రి సవిత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర్ల డవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఈశ్వరరావు, డైరెక్టర్లు, ఉమ్మడి కృష్ణా జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘ ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వడ్డెర సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏపీ పారిశ్రామిక రంగంలో గొప్ప ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)



ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. 5,465 ఎకరాల్లో మొత్తం రెండు దశల్లో ఈ ప్రాజెక్టు సాకారం కానుంది. మొదటి దశలో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులు, రెండో దశలో 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఉక్కు ఉత్పత్తి చేయనుంది.

**క్యాప్టివ్ పోర్టుతో మరో 6 వేల ఉద్యోగాలు :** స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా 50 మి.మె.ట సామర్థ్యంతో అదనంగా 316 ఎకరాల్లో క్యాప్టివ్ పోర్టును కూడా ఏఎంఎన్ఎస్ ఇండియా ఏర్పాటు చేయనుంది. దీని కోసం ప్రత్యేకంగా రూ.11,198 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. దీంతో మరో 6,000 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏఎంఎన్ఎస్ ఇండియా ప్లాంట్ ఏర్పాటుతో విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిశ్రమల హబ్‌గా రూపుదిద్దుకోనుంది. గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా దేశంలో భారీగా పెరిగిన ఉక్కు మార్కెట్‌లో కీలక పాత్ర పోషించే అవకాశం ఏఎంఎన్ఎస్ ఇండియాకు లభించనుంది.

**అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వ సహకారం :** ఈ ప్రాజెక్టు త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోంది. స్టీల్ ప్లాంట్‌ను ఎన్‌హెచ్-16తో కలిపేలా 4 లేన్ రహదారి విస్తరణ పనులు చేపట్టింది. కనెక్టివిటీ పెంచడంతో పాటు పరిశ్రమకు అవసరమయ్యే నీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు శరవేగంగా కల్పిస్తోంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు :** సోమవారం జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారు. అలాగే కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. ఇంకా ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు అనిత, టి.జి. భరత్, ఎంపీ సి.ఎం. రమేష్ విశిష్ట అతిథులుగా హాజరవుతారు. ఆర్సెలార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా చైర్మన్ ఆదిత్య మిట్టల్ భూమి పూజలో పాల్గొంటారు. సోమవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి నేరుగా నక్కపల్లి మండలం రాజయ్యపేటకు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. మధ్యాహ్నం 3.40 గంటలకు ఎక్స్‌పీరియన్స్ జోన్ సందర్శించి, ఏఎంఎన్ఎస్ ఇండియా స్టీల్ ప్లాంట్ మోడల్‌ను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన ఫలకం ఆవిష్కరిస్తారు. అలాగే అవగాహన ఒప్పందాల కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు.

## అనాథలను అమ్మలా ఆదరిస్తున్న అభినందన ఫౌండేషన్




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలో ఏటుకూరు సమీపాన సుమారు 60 మంది అనాథ పిల్లలను చేరదీసి అమ్మలా ఆదరిస్తూ విద్యాబుద్ధులు నేర్పిస్తున్న అభినందన ఫౌండేషన్ కృషి అభినందనీయమని జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి కొనియాడారు. ఆదివారం శివ ట్యూషన్స్ విద్యార్థి బృందం అభినందన ఫౌండేషన్ బాలబాలికలకు ప్రతిభా పురస్కారాలను అందించింది. ఈ సందర్భంగా వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ అభివృద్ధి చెందిన దేశాలు ప్రపంచ సంతోష సూచికలో ప్రపంచంలో తొలి పది స్థానాలలో ఉండగా, భారతదేశం 116వ స్థానంలో ఉండటం బాధాకరమని అన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించే దిశగా విద్యార్థి దశ నుండే ప్రోత్సహిస్తూ శివ ట్యూషన్స్ అడుగులు వేయటం హర్షణీయమన్నారు. గుంటూరు నగరంలో కోవిడ్ ఫైటర్స్, మానవత, కార్మెల్ సేవా సదన్, నేస్తం ఫౌండేషన్ లాంటి సంస్థలు బహుముఖ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని, అనేక మంది దాతలు ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు.

నేస్తం వ్యవస్థాపకులు జలీల్ అహ్మద్ ప్రసంగిస్తూ అనాథ శరణాలయాల్లోని పిల్లలతో విద్యార్థులు మమేకమవ్వడం, వాళ్లు చదువుకుంటూనే మరికొందరిని చదివించడం అభినందనీయమన్నారు.

శివ ట్యూషన్స్ వ్యవస్థాపకులు వై. మురళీ కృష్ణ ప్రసంగిస్తూ పోటీ పరీక్షలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు యుక్త వయసులోనే సేవా రంగం వైపు అడుగులు వేయడం ఆనందంగా ఉందని, తమ విద్యార్థులు సమకూర్చుకున్న 35 వేల రూపాయలను ప్రతిభాపారితోషకాలుగా అందజేయడం సంతోషకరమన్నారు.

అభినందన ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె. నిర్మల్ కుమార్ ప్రసంగిస్తూ గత దశాబ్ద కాలంగా అనాధ పిల్లలకు ఆశ్రయం కల్పించి, వారికి ఉన్నత చదువులు చెప్పించడం సంతృప్తినిస్తోందని, కుటుంబ సభ్యులు, దాతల సహకారంతో ఈ మహత్కార్యం సాధ్యమవుతుందన్నారు.

ఈ సందర్భంగా శివ ట్యూషన్స్ విద్యార్థి బృందం అభినందన ఫౌండేషన్ నందు గల పిల్లలందరితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకులు టి. ధనుంజయరెడ్డి, చేయూత ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు వి. విజయలక్ష్మి, ఉపాధ్యాయురాలు కొడాలి పద్మ, మానవత కార్యవర్గ సభ్యులు మేకల రామారావు, కె. సత్యనారాయణ, బ్యాంకు ఉద్యోగి శ్రీనివాస్, అభినందన ఫౌండేషన్ ప్రతినిధులు కె. పద్మావతి, కె. దినేష్, కె. పావని మౌనిక తదితరులు ప్రసంగించారు.

## రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జొన్నాదుల జ్యోతి



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మంగళగిరి మార్కండేయ కాలనీకి చెందిన న్యాయవాది జొన్నాదుల జ్యోతి నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు నియామక పత్రాన్ని ఆదివారం అందజేశారు. 104 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన అఖిలభారత పద్మశాలి సంఘం అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం ఉంది. తన నియామకంపై జొన్నాదుల జ్యోతి జ్యోతి ధన్యవాదాలు తెలియచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, సంఘం చేపట్టే కార్యక్రమాల్లో పాలు పంచుకుంటానని ఈ సందర్భంగా జ్యోతి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జొన్నాదుల జ్యోతి నియామకంపై పలువురు పద్మశాలి ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంపై సీఐటీయూ మండిపాటు



విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) : నగరంలోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జే. సింహాచలం అధ్యక్షతన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ (యూపిహెచ్‌సీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర తొలి మహాసభ ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరయ్యారు.

మహాసభలను సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందని విమర్శించారు. యూపిహెచ్‌సీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, హెచ్‌ఆర్ పాలసీ, కనీస టైమ్‌స్కేలు, లీవ్ పాలసీ అమలు చేయకపోవడం శ్రమ దోపిడీకి దారితీస్తోందని పేర్కొన్నారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని, మహాసభ తీర్మానాలకు, భవిష్యత్ కార్యాచరణకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. యూపిహెచ్‌సీ ఉద్యోగులు హక్కుల సాధన కోసం ఏకతాటిపైకి రావాలని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు కూడా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు.

సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఆ. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తక్షణమే స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహాసభలో పలు సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయాలు తీసుకున్నారు.

# అత్యధిక కాలం సేవలందించిన ప్రభుత్వ అధినేతగా మోదీ



- **రికార్డు సృష్టించిన మోదీ సేవా కాలం... దేశానికి దిశానిర్దేశం చేసిన నాయకత్వం**
- **ఆంధ్రప్రదేశ్ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ**

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుదీర్ఘకాలంగా ప్రభుత్వాన్ని నడిపిస్తూ దేశంలోనే అత్యధిక కాలం సేవలందించిన ప్రభుత్వ అధినేతగా నిలవడం విశేషమని ఆంధ్రప్రదేశ్ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు.

8,931 రోజుల సేవా ప్రయాణం కేవలం గణాంకం మాత్రమే కాకుండా దేశానికి స్థిరత్వం, స్పష్టమైన దిశానిర్దేశం అందించిన నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన మద్దతు మోదీపై ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు. మోదీ పాలనలో పారదర్శకత, అవినీతి రహిత వ్యవస్థ, సంక్షేమం-అభివృద్ధి సమన్వయం స్పష్టంగా కనిపించాయని పేర్కొన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చూపిన దూరదృష్టి ప్రశంసనీయమని అన్నారు.

అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రతిష్ఠ మరింత పెరిగిందని, గ్లోబల్ సౌత్ దేశాలకు నాయకత్వం వహించే స్థాయికి చేరిందని వివరించారు. 'వికసిత్ భారత్' లక్ష్యంతో దేశం వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు.

మోదీ సుదీర్ఘ సేవా కాలం ప్రజల విశ్వాసానికి ప్రతిబింబమని, భవిష్యత్తులో కూడా దేశాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపిస్తారని వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మైదుకూరులో ఆపరేషన్ వజ్రా పహార్ నిర్వహించిన రూరల్ సీఐ



మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్ ):మైదుకూరు పట్టణంలో ఆదివారం ఆపరేషన్ వజ్రపహార్ లో భాగంగా మైదుకూరు ఆర్ టి సి ఆవరణలో ఉండే కార్గో పార్సెల్ కార్యాలయంలో తనిఖీ చేసారు. గంజాయి రవాణాను నిషేధించాలనే ఉద్దేశంతో అన్ని ట్రాన్స్పోర్ట్ మరియు పార్సెల్ సర్వీసెస్ లో విస్తృత తనిఖీలు నిర్వహించి అక్కడ ఉన్న యజమానులకు గంజాయి రవాణా గురించి ఏమైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, ఒకవేళ ఏమైనా పార్సెల్లు అనుమానంగా ఉంటే ఆ సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని మైదుకూరు అర్బన్ ఇన్స్పెక్టర్ కె. రమణారెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట రమణ మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# నేడు హుండీ లెక్కింపు

కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రసిద్ధి గాంచిన స్వయం భూ శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈ ఓ జక్కా శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గం లకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. అదే విధంగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్, కమిటీ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

# ప్రజాసంక్షేమం రాష్ట్ర అభివృద్ధి ఇదే కూటమి ప్రభుత్వ మైండ్ సెట్

- **కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**
- **అతిరథ మహారథుల సమక్షంలో...**
- **ఘనంగా మార్కెట్ యార్డు పాలకమండలి ప్రమాణ స్వీకారం**



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): కూటమి ప్రభుత్వం మైండ్ సెట్ రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమేనని కూటమి పార్టీల సమన్వయంతొ మార్కెట్ యార్డు పాలకమండలి ఏర్పాటు అభినందనీయమని కేంద్ర సహాయమంత్రి పెమ్మసానిచంద్రశేఖర్ నూతన పాలక మండలికి అభినందనలు తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ పాలక మండలి ప్, ప్రమాణ స్వీకార ఉత్సవం కూటమి పార్టీల కోలాహలం నడుమశనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తొలుత పట్టణంలోని శివాజీ చౌక్ నుండి మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీగా తరవచ్చారు.

నియోజకవర్గంలోని కూటమి పార్టీలో బలమైన తెలుగుదేశం, జనసేన ప్రజాప్రతినిధులు, మంత్రులు అతిధులుగా పాల్గొన్న, మార్కెట్ యార్డు పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవంలొ ముఖ్య అతిధిగాపాల్గొన్న, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్, ఆత్మీయ అతిధులు మంత్రి నాదెండ్ల మనోహర్, కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, లీడ్ క్యాప్ చైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు, జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వర్రావు,మహిళా కమిషన్ మాజీ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి తదితర ప్రముఖుల సమక్షంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ గా తోట దుర్గా ప్రసాద్, వైస్ ఛైర్మన్ గా పాలడుగు సురేంద్ర, మరో 12 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈసందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూమాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి, ఇటీవల మాట్లాడిన మాటల్లో వ్యంగ్యాన్ని ప్రస్తావిస్తు,ప్రశ్నించారు. జగన్ ఎవరి మైండ్ సెట్ మారాలో ఆలోచించుకోమమన్నారు. మైండ్ సెట్ మారడమంటేప్రజావేదికను కూల్చడమా,అమరావతి నిర్మాణాన్ని ఆపేయడమా అనిప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లు వేసాం, అభివృద్ధి పనుల నిర్మాణాలు చేపట్టాం,అమరావతి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. అనకాపల్లిలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ వస్తుంటే,నీ హయాంలో మీ సొంత నియోజకవర్గంలో స్టీల్ ప్లాంట్ కోసం శంకుస్థాపన చేసినా మీరు,కనీసం ఇటుక కూడా వేయలేదు కదా.. కూటమి ప్రభుత్వానిది అభివృద్ధి మైండ్ సెట్ అన్నారు. అభివృద్ధి నిరోధకులైన మీరని అన్నారు. మరి ఎవరి మైండ్ సెట్ మారాలి అని ఎద్దేవ చేశారు,మార్కెట్ యార్డ్ కమిటీ పాలక వర్గాన్ని ఏర్పాటు చేసిన తీరును ప్రస్తావిస్తు, కమిటీకి అభినందనలు తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతును ఉద్ధరిస్తాం అని మాటలతొ సరిపెట్టకుండా, రైతుకు వెన్నెముకగా నిలిచిన నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. జోడెద్దుల వలే, కష్టపడే రైతులు,కౌలు రైతులను కంటికి రెప్పలా కూటమి ప్రభుత్వం కాపాడుతుందనీ తెలిపారు. ఆ ప్రయత్నంలో భాగంగానే కూటమి ప్రభుత్వం నుండి మార్కెట్ యార్డ్ కమిటీ ఆవిర్భావం జరిగిందనీ లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ,రైతులకు, కౌలురైతు లకు, వారి కుటుంబాలకు ఉపయోగపడేలా పనిచేయాలన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర శ్రేయస్సు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కలిసి 15 ఏళ్లు ప్రయాణించాలని పవన్ కళ్యాణ్ పిలుపు ఇవ్వడం వెనుక గల కారణాన్ని అందరూ అర్థం చేసుకోవాలనీ అన్నారు,గత ప్రభుత్వంరైతాంగం పట్ల ఎంత అరాచకంగా వ్యవహరించిందో అందరికీ తెలుసని, రైతు కష్టపడి పండించిన ధాన్యాన్ని ఏ మిల్లులో అమ్ముకోవాలో కూడా అప్పటి వైసిపి నాయకులే నిర్ణయించేవారనీ,ఒక బస్తా యూరియా కోసం రైతులు ఎన్ని కష్టాలు పడ్డారో మనందరికీ తెలుసని అన్నారు. అలాంటి పరిస్థితుల్లోరైతుల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అప్పటి నుండి రైతుల కోసం తీసుకుంటున్న నిర్ణయాలు,అమలు చేస్తున్న సంక్షేమంలో భాగంగా మన తెనాలి మార్కెట్ యార్డ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందనీ అన్నారు.

ఈ కార్యక్రమంలో డిసి ఎమ్ఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం జనసేన సమన్వయకర్త బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, ూవీజ మాజీ చైర్మన్ లు,తోటకూర వెంకట రమణరావు,వంగా సాంబి రెడ్డి, యార్డ్ కమిటీ డైరెక్టర్లు, రైతులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా శాలివాహన-మొల్ల సాంస్కృతిక వైభవం



విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) : భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో "శాలివాహన చక్రవర్తి – కవయిత్రి మొల్ల సాంస్కృతిక వైభవం" కార్యక్రమం ఆదివారం విజయవాడలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.

ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ కుమ్మరి వృత్తి ప్రాధాన్యతను వివరించారు. మట్టి మన జీవితానికి మూలాధారం అని, మనం మట్టిలో పుట్టి మట్టిలో కలిసిపోతామని పేర్కొన్నారు. మట్టిని ఆధారంగా చేసుకుని జీవిస్తున్న కుమ్మరి వృత్తిదారులు సమాజానికి అత్యంత అవసరమని, వారి గౌరవాన్ని పెంచేందుకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు.

శాలివాహన చరిత్రను స్మరించుకుంటూ, కుమ్మరి వృత్తి నుంచి రాజుగా ఎదిగిన గొప్ప చరిత్ర శాలివాహనునిదని మాధవ్ తెలిపారు. శాలివాహన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కుమ్మరి వృత్తి లేకపోతే మానవ జీవనం అసంపూర్ణమవుతుందని, మట్టి పాత్రల వినియోగం ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడుతుందని చెప్పారు.

కుమ్మరి వృత్తిదారులకు సంబంధించిన పలు జీవోలను పునరుద్ధరించి వారి అభ్యున్నతికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కుమ్మరి జాతి బలహీన వర్గం కాదని, బలమైన సామాజిక వర్గంగా ఎదగడానికి బీజేపీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ మాట్లాడుతూ, శాలివాహన చరిత్రను భావితరాలకు పరిచయం చేయడం అత్యంత అవసరమన్నారు. కుమ్మరి వృత్తి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిందని, మట్టి ఆధారిత జీవన విధానం భారతీయ సంస్కృతికి మూలస్థంభమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కుమ్మరి సంఘాలను బలోపేతం చేసి, వారి ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. బీజేపీ ఎల్లప్పుడూ బీసీ వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ, సంప్రదాయ వృత్తులను పరిరక్షించడం సమాజ బాధ్యత అని అన్నారు. కుమ్మరి వృత్తి కేవలం ఉపాధి మార్గమే కాకుండా భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. శాలివాహన, మొల్ల వంటి మహనీయుల చరిత్రను యువతలో చైతన్యంగా మలచాల్సిన అవసరం ఉందన్నారు. కుమ్మరి వృత్తిదారులకు ఆధునిక సాంకేతికతను చేరువ చేసి, మార్కెట్ అవకాశాలను విస్తరించే దిశగా కృషి చేయాలని సూచించారు. బీజేపీ నాయకత్వంలో బీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్ మాట్లాడుతూ, కవయిత్రి మొల్ల సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించినందుకు బీజేపీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కుమ్మరి వృత్తి అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే గొప్ప సంప్రదాయ వృత్తి అని పేర్కొన్నారు. కొత్త తరం యువతకు మొల్ల, శాలివాహన చరిత్రను తెలియజేయడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, ఒంగోలు జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు తదితరులు, ఓబీసీ మోర్చా నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కుమ్మరి సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇస్లాం బోధనలు అనుసరణీయం



- **పవిత్ర రంజాన్ ప్రార్థనలలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి**

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : ధార్మిక, దాతృత్వ పరమార్థాన్ని సమిష్టిగా తెలియజేసే పవిత్ర పర్వదినం రంజాన్ అని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆయన ఈద్ ముబారక్ చెప్పారు.

గుజ్జనగుళ్ళ మశీదు వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కఠోర దీక్షలు, కఠిన ఉపవాసాలు, దైవారాధన, దానధర్మాలు, చెడును త్యజించడం, సాటి మానవులకు సేవ వంటి సత్కార్యాల ద్వారా అల్లాహ్ స్మరణలో తరించే ఈ రంజాన్ పండగ, సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమానత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని అన్నారు. అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ మానవాళికి సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని ఆయన చెప్పారు.

ఇస్లాం బోధనలు ఎల్లప్పుడూ అనుసరణీయమని, అవి మానవ జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఇస్లాం ధర్మం పరస్పర ప్రేమానురాగాలను, సోదరభావాన్ని, ఐక్యతను చాటుతుందని ఆయన తెలిపారు. కులమతాలకు అతీతంగా మానవ సేవకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, ఈ పవిత్ర మాసం అందించే స్ఫూర్తిని ఏడాది పొడవునా కొనసాగిస్తూ అందరూ కలిసిమెలిసి జీవించాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు.

ఈ ప్రార్థనలలో అబ్బాస్, మార్కెట్ బాబు, షేక్ రబ్బానీ, మున్నా, షఫి, బుజ్జి, గౌస్, సమీర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు పిల్లలకు విద్యుత్ ఘాతం





మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): బహుళ అంతస్తుల భవనాల ముందు, ఉండే విద్యుత్ సరఫరా లైన్లకు సంబంధించి తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం ఇద్దరు పిల్లలకు శాపంగా మారింది. తాడేపల్లి మండలంలోని ఉండవల్లి గ్రామంలో స్థానిక ఎస్బీఐ బ్యాంక్ ముందు ఉన్న ఇంటిలో ఇద్దరు పిల్లలు ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో విద్యుత్ ఘాతానికి గురయ్యారు.

ఉండవల్లి సెంటర్ ఎస్బీఐ బ్యాంక్ ఎదురుగా మూడవ అంతస్తులో ఉండే కుప్పాల త్రివిక్రమ్(11), కుప్పాల విష్ణుప్రియ(13), వారు నివాసం ఉండే బాల్కనీ ఎదురుగా ఉన్న కరెంట్ తీగలపై టవల్ పడడంతో, తీసే ప్రయత్నం చేయగా, ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో బాలుడు త్రివిక్రమ్ కు చేతికి గాయమవ్వగా, బాలిక విష్ణుప్రియ కి తీవ్ర గాయాలయ్యాయి.

హుటాహుటిన మణిపాల్ ఆస్పత్రికి, చికిత్స నిమిత్తం తరలించగా, బాలిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలియజేశారని, కుటుంబ సభ్యులు తెలిపారు.

రెక్కాడితే కానీ, డొక్కాడని స్థితిలో ఉన్నామని,రోజూ పనులు చేసుకుని బ్రతికే, తమకు జరిగిన అనుకోని ఘటన వలన దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, వైద్య ఖర్చులు ఆర్థికంగా భారంగా మారాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వలన జరిగిన ఈ ఘటనపై ఆ శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ప్రతి కార్యకర్త బాధ్యతతో పని చేయాలి

- **బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు**



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ): పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ 2026 కింద గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు వెస్ట్ 7 మండలం, తాడేపల్లి పట్టణం,తుళ్లూరు మండలాలలో నిర్వహించిన శిక్షణా శిబిరంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు ప్రసంగిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో ప్రశిక్షణ అభియాన్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. పార్టీ కార్యకర్తలకు సైద్ధాంతిక స్పష్టత, సంస్థాగత నైపుణ్యాలు, పార్టీ ఆశయాలు మరియు విధానాలపై లోతైన అవగాహన కల్పించడానికి ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. సుశిక్షితులైన కార్యకర్తలే బలమైన వెన్నెముక గా ఉంటుందన్నారు.

ప్రజా సంబంధాల ప్రాముఖ్యతను చెబుతూ, ప్రజలతో నిరంతరం సమన్వయం పాటిస్తూ, వారి సమస్యలను పరిష్కరించడానికి అందుబాటులో ఉండాలని పార్టీ కార్యకర్తలను కోరారు. వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హులైన వ్యక్తికి చేరేలా చూస్తూ, బీజేపీ కార్యకర్తలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని ఆయన అన్నారు.

పార్టీ సంస్థాగత స్వరూపం గురించి వివరిస్తూ, బీజేపీ క్రమశిక్షణ, అంకితభావం మరియు స్పష్టమైన నిర్మాణంతో పనిచేస్తుందని తెలిపారు. ఇందులో ప్రతి కార్యకర్తకు నిర్దిష్టమైన పాత్ర మరియు బాధ్యత ఉంటుందని అన్నారు. దేశానికి ప్రథమ స్థానం, సంస్థకు రెండవ స్థానం, స్వప్రయోజనాలకు చివరి స్థానం అనే మార్గదర్శక సూత్రాన్ని పార్టీ ఎల్లప్పుడూ అనుసరిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

బీజేపీ కార్యకర్తలు సమాజం మరియు దేశం కోసం జీవిస్తారని, నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలనే దార్శనికతతో పనిచేస్తారని ఆయన అన్నారు. సేవ, జాతీయవాదం మరియు సుపరిపాలన ఆదర్శాలకు కట్టుబడి ఉండాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమం లో ఆయా ప్రాంతాల వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్ వయోజన కేంద్రంలో సేవలు ప్రశంసనీయం

- **బీజేపీ కోహికోడ్ అసెంబ్లీ ఇంచార్జ్ తాడువాయి రామకృష్ణ**



నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్): ఆర్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ మంగళం వయోజన కేంద్రంలో వృద్ధులకు అందుతున్న సేవలు ప్రశంసనీయమని బీజేపీ కోహికోడ్ అసెంబ్లీ ఇంచార్జ్ తాడువాయి రామకృష్ణ అన్నారు. కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

పసిపిల్లలు తల్లి ఒడిలో ఎలా సురక్షితంగా పెరుగుతారో, అలాగే ఈ కేంద్రంలో వృద్ధులు ఆప్యాయతతో సంరక్షణ పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని వృద్ధులకు ఇలాంటి సేవలు అందించడం గొప్ప విషయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో కోహికోడ్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కె కె వినోద్ కుమార్, కన్నూర్ పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జ్, గోవా రాష్ట్ర రాజ్యసభ సభ్యుడు సదానంద శెట్ తనవాడే, కేంద్ర నిర్వాహకులు టి. రమేష్, జయకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 300 మంది మేధావులు, వివిధ వర్గాల ప్రజలు హాజరైన ఈ సమావేశంలో తాడువాయి రామకృష్ణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వృద్ధుల సంక్షేమానికి చేపట్టిన పథకాల గురించి వివరించారు. వృద్ధులకు అందిస్తున్న ప్రయోజనాలు సమాజంలో మార్పుకు దోహదపడుతున్నాయని అన్నారు.

ఈ సందర్భంగా పాల్గొన్నవారు ప్రధానమంత్రిపై ప్రేమాభిమానాలు వ్యక్తం చేస్తూ సేవలను అభినందించారు. కార్యక్రమం సానుకూల వాతావరణంలో సాగింది.



## తెదేపా యువ నాయకుడికి కన్నీటి వీడ్కోలు

**శాంతిపురం, మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

శుక్రవారం రాత్రి గుండిశెట్టిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన అదే గ్రామానికి చెందిన శాంతిపురం మండల ఐటీడీపీ యువ నాయకుడు రవి కి తెదేపా పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెదేపా నేతలు మాట్లాడుతూ రవి ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మరణించడం తీవ్ర విషాదాన్ని కలిగించిందని ఆయన మరణ వార్త విని ఎంతో దిగ్భ్రాంతి కలిగిందని అన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి రవి చేసిన సేవలు చిరస్మరణీయమైనవని, పార్టీ అభివృద్ధి కోసం ఆయన చూపిన కృషి, నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తాయని తెలియజేశారు. సమాజానికి సేవ చేయాలనే తపనతో పనిచేసిన యువ నాయకుడిని కోల్పోవడం పార్టీకి మరియు స్థానిక ప్రజలకు అపూర్వ నష్టమని తమ బాధను వ్యక్తం చేశారు. రవి ఆత్మకు సద్గతి కలగాలని భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నామని ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి ధైర్యం, ఆత్మస్థైర్యం కలగాలని ఆకాంక్షిస్తున్నామని ఈ కష్టకాలంలో పార్టీ తరఫున పూర్తి మద్దతు ఎల్లప్పుడూ వారి కుటుంబానికి ఉంటుందని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్ పర్సన్ పి ఎస్ మునిరత్నం, కుప్పం పలమనేరు మదనపల్లి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్, శాంతిపురం మండల తెదేపా పార్టీ అధ్యక్షులు ఉదయ్ కుమార్ మొదలగు నాయకులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

## రోజా నోరు అదుపులో పెట్టుకో

### మాజీ మంత్రి రోజా వ్యాఖ్యల పై తెలుగు మహిళల ఆగ్రహం




**చిత్తూరు, మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

మాజీ మంత్రి రోజా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని చిత్తూరు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు లీలావతి హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. తమ అధినేత నేర్పిన సంస్కారంతో తెలుగు మహిళలు ఎంతో ఓపికగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి నేర్పిన సంస్కారంతో ఆ పార్టీ నేతలు రెచ్చిపోయి మాట్లాడటం సమంజసం కాదన్నారు. గత ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి ఏమిటో ప్రజలందరూ గమనించి 11 సీట్లకు పరిమితం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వంలో రెండింతలుగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. మాజీ మంత్రి రోజా ఇష్టపకారం కూటమినేతలపై నోరు పారేసుకుంటే రాష్ట్రంలోని తెలుగు మహిళలు ఊరుకునేది లేదని రాష్ట్రవ్యాప్తంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో తెలుగు మహిళా నాయకులు సుమతి, హేమ, పుష్ప, హీర, మేరీ, దుర్గా, శీలా పాల్గొన్నారు.

## నాయనూరులో తాగునీటి తీవ్ర సమస్య

### పది నెలలుగా పట్టించుకోలేదని గ్రామస్తుల ఆవేదన



**కుప్పం, మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

చిత్తూరు జిల్లా కుప్పం మండలం నాయనూరు పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. గ్రామంలో గుక్కెడు నీళ్లు దొరకని పరిస్థితి నెలకొనగా, గత పది నెలలుగా సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బోర్లు ఎండిపోవడం, పైపులైన్ ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీటి కోసం మహిళలు, వృద్ధులు కిలోమీటర్ల దూరం నడిచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యం కూడా దెబ్బతింటోందని ఆందోళన చెందారు. సమస్యను పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారి నుండి ఎటువంటి స్పందన లేదని గ్రామస్తులు ఆరోపించారు. పది నెలలుగా ఇలాంటి పరిస్థితి కొనసాగుతుండటంతో గ్రామ ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి తక్షణం తాగునీటి సౌకర్యం కల్పించాలని, శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ఐటీడీపీ ప్రతినిధి బి. రవి మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం

**కుప్పం, మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్)**



చిత్తూరు జిల్లా ఐటీడీపీ అధికార ప్రతినిధి బి. రవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలానికి చెందిన రవి ప్రమాదవశాత్తు మరణించడం పట్ల సీఎం దిగ్భ్రాంతి వ్యక్తం చేసినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన యువ నాయకుడిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. రవి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన ముఖ్యమంత్రి, వారి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం, పార్టీ తరఫున అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రవి మరణంతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొనగా, పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనకు నివాళులు అర్పిస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నారు.

# రైజ్ కేంద్రానికి నీతి ఆయోగ్ పట్టం





- రూ. 1.55 కోట్ల ఆర్థిక మద్దతుకు ఉత్తర్వులు
- మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు విలువైన చేయూత
- సీఎం నిత్యనూతనం-వినూత్నం నినాదానికి అనుగుణంగా అడుగులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

స్వర్ణాంధ్ర విజన్ ఏ 2047, వికసిత్ భారత్ సాకారం దిశగా చేస్తున్న వినూత్న ప్రయత్నాల్లో భాగంగా ఆకాంక్షిత బ్లాకు అయిన ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో జిల్లా యంత్రాంగంఏర్పాటు చేసిన రూరల్ ఇన్నొవేషన్స్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఎంటర్ప్రెన్యూర్షిప్ సెంటర్ (రైజ్) కేంద్రానికి నీతి ఆయోగ్ పట్టంకట్టిందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు చేపడుతున్న కార్యక్రమాలకు రూ. 1.55 కోట్ల ఆర్థిక మద్దతుకు ఆమోదం తెలుపుతూ తాజాగా ఉత్తర్వులిచ్చినట్లు వెల్లడించారు.రైజ్ కేంద్రానికి నీతి ఆయోగ్ ఆర్థిక మద్దతుపై కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి శనివారం కలెక్టరేట్‌లో జరిగిన మీడియా సమావే శంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామీణ మహిళలు ముఖ్యంగా స్వయం సహాయ క సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు గౌరవ సీఎం ఆకాంక్ష అయిన ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త స్ఫూర్తికి అనుగుణంగా అడుగులు వేసి వినూత్నంగా రైజ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యంగా రూపొందించిన ఈ వినూత్న కార్యాచరణ ప్రణాళికకు నీతి ఆయోగ్ నుంచి గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. రైజ్ కేంద్రం ప్రణాళికపై నీతి ఆయోగ్‌కు సవివర నివేదిక పంపగా పరిశీలించి ఆర్థిక మద్దతుకు ప్రత్యేక కమిటీ ఆమోదం తెలిపినట్లు వివరించారు. ఈ నిధులు ఇబ్రహీంపట్నం బ్లాకులో ఏఐ ఆధారిత నైపుణ్య సర్వే, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన తదితరాలకు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ మద్దతు మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు పెద్ద చేయూత అని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

**ఏఐ సహా విభిన్న అంశాల్లో శిక్షణ...**

ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తున్న "నిత్య నూతనం-వినూత్నం" నినాదానికి అనుగుణంగా మరిన్ని సృజనాత్మక కార్యక్రమాలను అమలు చేస్తామని, మహిళలు అన్ని రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేలా టీమ్ ఎన్టీఆర్ కృషిచేస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. రైజ్ కేంద్రంలో హెల్ప్ డెస్క్, ఐడియా డెస్క్, స్కిల్లింగ్ డెస్క్, ప్లేస్‌మెంట్ డెస్క్, బ్యాంకింగ్ డెస్క్ లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. అన్ని రకాల సేవలు ఒకేచోట అందేలా రైజ్ కేంద్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. రైజ్ కేంద్రంలో ఇప్పటికే వెయ్యిమందికి పైగా మహిళలకు ఏఐ, స్పోకెన్ ఇంగ్లిష్, పేపర్ క్రాఫ్ట్స్, కార్ డ్రైవింగ్, మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్, సోలార్ ప్యానెల్ ఫిక్సింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ), ఏ2 ఫీ వంటి వాటిపై వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించినట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాలను, రైజ్ కార్యాచరణను సద్వినియోగం చేసుకొని 300 కుటుంబాలకు పైగా ఇప్పటికే వివిధ యూనిట్లు ప్రారంభించి పారిశ్రామికవేత్తలుగా ఎదిగారన్నారు. రైజ్ కేంద్రంలో విభిన్న అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయని.. ప్రతివారం వివిధ అంశాల్లో వర్క్‌షాప్‌లు సైతం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు మహిళలను క్షేత్ర పర్యటనలకు కూడా తీసుకెళ్తున్నట్లు తెలిపారు. అలీప్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆర్‌టీఐహెచ్ తదితరాలతో కూడా చేతులు కలిపామన్నారు. రైజ్ కేంద్రంలో ప్రతినెలా ఎన్టీఆర్ వికాస ద్వారా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాజా విజయానికి సహకరించిన గౌరవ ముఖ్యమంత్రి, స్థానిక పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, సెర్ప్ అధికారులు, మీడియా ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. రైజ్‌ను సద్వినియోగం చేసుకోవాలనుకునే ఔత్సాహికులు 70753 85588 నంబరులో సంప్రదించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, ఇబ్రహీంపట్నం ఎంపీడీవో డి.శకుంతల, ఏబీపీ బ్లాక్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, రైజ్ మేనేజర్ బి.తేజస్విని పాల్గొన్నారు.

# కుల వివక్షతపై కఠిన చర్యలు తీసుకోవాలి

- కోనసీమ ఘటనపై ఆగ్రహం
- అల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్



**విజయవాడ, మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

నేటి ఆధునిక సమాజంలో కూడా కుల వివక్షత కొనసాగుతుండడం తీవ్ర ఆందోళనకరమని అల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కోనసీమ జిల్లాలోని పి. గన్నవరం మండలం కుందాలపల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఎస్సీ కులానికి చెందిన వ్యక్తి మరణించగా, ఆయన అంత్యక్రియల కోసం గ్రామ రహదారిపై కూడా అనుమతి ఇవ్వకుండా అడ్డుకోవడం దారుణమని పేర్కొన్నారు. ఇది మన సమాజంలో కుల వివక్ష ఇంకా బలంగా కొనసాగుతున్నదానికి ఉదాహరణగా నిలుస్తుందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, దళితులపై వివక్ష ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత బీ ఆర్ అంబేద్కర్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం కల్పించిన హక్కులకు విరుద్ధంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనను ఖండిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దళితులపై జరుగుతున్న వివక్షను అరికట్టడానికి ప్రభుత్వం తక్షణమే స్పందించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

## అనుదీప్ హత్య పై విచారణ జరపాలి

# హంతకులను అరెస్ట్ చేయాలి

కుట్ర దారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

- లేని పక్షం లో చాట్రాయ్‌లో నిరవధిక నిరసన చేస్తా
- రాష్ట్ర కాపు జేఏసి అధ్యక్షులు చందు జనార్దన్



**విజయవాడ, మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

నూజివీడు నియోజకవర్గం చాట్రాయ్‌లో కాపు కుటుంబానికి చెందిన అంబటి అనుదీప్ మరణంపై సమగ్ర విచారణ జరిపి, హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్ధన్ డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలో కాపు జేఏసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, అనుదీప్ మరణం హత్యేనని మండల ప్రజలు ఆరోపిస్తున్నప్పటికీ, స్థానిక పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనపై ఇప్పటికే అనుదీప్ తండ్రి అంబటి గోపాలరావు చాట్రాయ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల అనుదీప్ దశదినకర్మ కార్యక్రమం చాట్రాయ్‌లో నిర్వహించగా, కాపు జేఏసీ నాయకత్వం, మండల నాయకులు, జనసేన నేతలు కలిసి సుమారు 300 మంది పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి జేఏసీ తరఫున సానుభూతి తెలిపారు. అనుదీప్ తండ్రి మాట్లాడుతూ తన కుమారుడిని హత్య చేశారని, పోలీస్ యంత్రాంగం నేరస్తులకు సహకరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న పలువురు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో, అనుదీప్ హత్యపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, అలాగే నేరస్తులకు సహకరించిన పోలీస్ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని చందు జనార్ధన్ డిమాండ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే, చాట్రాయ్‌లో రాష్ట్ర కాపు జేఏసీ ఆధ్వర్యంలో నిరవధిక నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# అనుమానాస్పద మరణంపై ప్రత్యేక దర్యాప్తు ఆదేశాలు

- నిజం తేల్చాలని జిల్లా పోలీస్ అధికారికి మంత్రి పార్ధసారథి సూచన

**నూజివీడు, మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్)**



చాట్రాయి మండలం చాట్రాయి గ్రామంలో ఇటీవల అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించిన అంబటి దీపు అనుదీప్ వర్షిత్ ఘటనపై రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పందించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల ఆవేదనను విన్న మంత్రి, కేసుపై అనేక అనుమానాలు ఉన్న నేపథ్యంలో పూర్తి స్థాయి దర్యాప్తు అవసరమని పేర్కొన్నారు. వారి అభీష్టానికి అనుగుణంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఏలూరు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌తో మాట్లాడిన మంత్రి, ప్రత్యేక దర్యాప్తు (స్పెషల్ ఎంక్వయిరీ) చేపట్టాలని ఆదేశించారు. స్థానిక పోలీసులకే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాల అధికారులతో విచారణ జరిపి సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. అలాగే ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ, చెరువుగట్టు పరిసర ప్రాంతాలు, గ్రామంలోని ప్రధాన రహదారుల కెమెరా దృశ్యాలను పూర్తిగా పరిశీలించి నిజానిజాలు వెలికితీయాలని ఆదేశించారు. తల్లిదండ్రులతో మాట్లాడిన మంత్రి, కులం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ విషయం లో ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసు కుంటామని స్పష్టం చేశారు. మంత్రి వెంట పోలీస్ అధికారులు, కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఘనంగా దురిశెట్టి యోగీశ్వరా చారి ( చిన్న ) జన్మ దిన వేడుకలు



శేరిలింగంపల్లి (జర్నలిస్ట్ ఫైల్) : మియాపూర్ డివిజన్ సభ్యులు న్యూ కాలనీ వాస్తవ్యులు దురిశెట్టి యోగేశ్వరా చారి ( చిన్న ) పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ లయన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ , మియాపూర్ డివిజన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ టీమ్ సభ్యులు చక్రపాణి,భాష, రవి, సురేందర్, రాంబాబు, మూర్తి, శేఖర్ నాయుడు, వెంకట్రావు, ఎం ఆర్ కె చౌదరి, దోప్పలపూడి వినోద్ చౌదరి ,శ్రీను, పెద్దబాబు, సుదులగుంట్ల ప్రసాద్, రాజేష్, తులసి, పవన్, బాలు, మధుసూదన్ రెడ్డి, బొజ్జ రవికుమార్, సతీష్, సింహాచలం, కమలాకర్ రెడ్డి, పవన్ రెడ్డి, నరేష్ (నాని), పవన్, అభిజిత్, రాము, శ్యాంసుందర్ రెడ్డి, నరేష్, వెంకట్ లు దురిసెట్టి యోగేశ్వర చారి ( చిన్న )పుట్టినరోజు సందర్భంగా మన డి ఎస్ ఆర్ కె ప్రసాద్ తో కలిసి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ కేక్ కట్ చేయించి సాంప్రదాయ శాలువాతో ఆయనను సత్కరించడం జరిగింది.

## సదాశివపేటపట్టణ- మండల మైనార్టీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

**ఏడవ వార్డు కౌన్సిలర్ పాతదొడ్డి అనిత విష్ణువర్ధన్ రెడ్డి**





సదాశివపేట మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్) : గత నెల రోజుల నుండి దైవ ప్రార్థనలు,ఉపవాస దీక్షలతో పవిత్ర రంజాన్ మాసం చివరి రోజు ఈద్ ఉల్ ఫితర్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరుల ఆహ్వానం వరకు స్వగృహంకి వెళ్ళి ముస్లిం సోదర సోదరీమణులందరికీ వారి స్వగృహాలకు వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసారు. కౌన్సిలర్ పాత దొడ్డి అనిత విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ పవిత్ర దినం అందరి జీవితాల్లో సుఖశాంతులు, ఆరోగ్యం, శాంతి, ఆనందం నింపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారాయణ. కౌన్సిలర్ నర్సింలు. మచ్చేందర్. అయూబ్. తదితరులు పాల్గొన్నారు.

## వెల్జాల్ లో ఘనంగా రంజాన్ వేడుకలు

**-మైనార్టీ సోదరులకు ఈద్ ముబారక్ -మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్**

**-బి ఆర్ ఎస్ యువ నాయకుడు వానరాశి వెంకటేష్**



(జర్నలిస్ట్ ఫైల్) : తలకొండపల్లి : పవిత్ర రంజాన్ పర్వదినాన తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ పండగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీపీ సి ఎల్ శ్రీనివాస్ యాదవ్,బిఆర్ఎస్ నాయకులు వానరాసి వెంకటేష్, శివ విజయ్ కుమార్,ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పర్వదినాన ఉపవాసం ద్వారా కేవలం ఆధ్యాత్మికత శుద్ధి మాత్రమే కాదని పరస్పరం గౌరవం సహనం వంటి విలువలను కూడా నేర్పిస్తుందని విభిన్న మతాలు ఉన్నా మన అందరి లక్ష్యం శాంతి,ఐక్యతతో ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ ముజీబ్ ఉర్ రహిమాన్ నాయకులు గౌస్,దస్తగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు

## నూతన ఆటోను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



మంథని,మార్చి 22(జర్నలిస్ట్ ఫైల్) : మంథని మండలం మాజీ కో ఆప్షన్ మెంబర్ షేక్ బాబు కుమారుడు షేక్ షకీల్ నూతన ఆటో ను ప్రారంభించి, శుభాకాంక్షలు తెలిపిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్. ఆయన వెంట ఆటో డ్రైవర్స్, బీ ఆర్ ఎస్ నాయకులు శ్రీను, తదితరులు ఉన్నారు.

## రంజాన్ వేళ ముస్లిం నాయకుల ఇళ్లలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తేనేటి విందు



మంథని, మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్) : రంజాన్ పండుగను పురస్కరించుకుని మంథని పట్టణంలో ఆత్మీయత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్కే యాకూబ్, సుల్తాన్ ఆసిఫ్ ఖాన్, ఇర్ఫాన్‌ల స్వగృహాల్లో ఏర్పాటు చేసిన తేనేటి విందును మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించడంలో పండుగలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం స్థానిక నాయకులతో ముచ్చటిస్తూ వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు తగరం శంకర్ లాల్ , శంకర్ గౌడ్, పుప్పాల తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

## మూసి సుందరీకరణపై ఆందోళన మధు పార్క్ అపార్ట్మెంట్ వాసుల రెండవ రోజు రిలే నిరాహార దీక్ష




రాజేంద్రనగర్, మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్) : నగరంలోని మూసి సుందరీకరణ ప్రాజెక్ట్ నేపథ్యంలో తమ ఇండ్లను ప్రభుత్వం కూల్చివేయనున్నదన్న ఆందోళనతో మధు పార్క్ అపార్ట్మెంట్ వాసులు నిన్న ప్రారంభించిన రిలే నిరాహార దీక్ష రెండో రోజు కూడా కొనసాగిస్తున్నారు.అపార్ట్మెంట్ వాసుల ప్రధాన డిమాండ్ తమ నివాసాలను కూల్చకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.ఈ నిరసన కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులుతో పాటు అపార్ట్మెంట్ వాసులు పెద్ద ఎత్తున పాల్గొని ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు.ప్రజల జీవన హక్కులను పరిరక్షిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఆదివారం చుట్టుపక్కల ఉన్న నాయకులు మరియు బాధితులతో పెద్ద ఎత్తున నిరాహార దీక్ష నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా రంజాన్ వేడుకలు.. భక్తి శ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు

**-ముగిసిన నెల రోజుల..రంజాన్ ఉపవాసాలు..**







వైరా (జర్నలిస్ట్ ఫైల్) : వైరా రిజర్వాయర్ ఆయన ఆనకట్ట సమీపంలోని ఈద్గా వద్ద రంజాన్ పర్వదిన సందర్భంగా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు "ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు ముస్లిం సోదరులకు రాజకీయ పార్టీల నాయకులు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వక్తులు రంజాన్ పర్వ దినం "సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక దీక్షలు చేపట్టి ప్రార్థన నిర్వహించటం మంచి శుభప్రదశీఅని అన్నారు. అల్లా దీవెనలు ప్రతి ఒక్కరికి అందాలని కోరారు. ముస్లింల ఆరాధ్య దైవం అల్లా..అనుసరణీయ గ్రంథం..అల్లా ప్రసాదించిన దివ్య ఖురాన్ ముస్లింల జీవన విధానాన్ని ఇస్లాం మార్గ నిర్దేశనం చేసింది.ఇస్లాం సూచించిన ఐదు మార్గ నిర్దేశ కాలలో రంజాన్ ఉపవాసాల పాటింపు ఒకటి. ఎవరైతే నెలరోజుల పాటు ఉపవాసాలు పాటిస్తారో వారు అల్లా కృపకు పా త్రులవుతారంటూ ఇది మినహాయింపు లేని ఖురాన్ గా నిరేశం జరిగింది.ము స్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ పండుగను మండలం లో ఘనంగా భక్తి శ్రద్ధలతోజరుపుకున్నారు.ఫిబ్రవరి19వ తేదీ నుంచి ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభించారు.దాదాపు 30 రోజుల పా టు దీక్షల రో జులలో 24 గంటల్లో సుమారు15 గంటలపాటు ఉపవాసం పా టిస్తూ..ఆ సమయంలో ఎలాంటి అన్నపానీయాలు తీసుకోకుండా గడపడం నిత్యం అల్లా నామస్మరణతో దివ్య ఖురాన్ పఠనంతోను..ఐదువేళ్లలా నమా జు ఆచరణ తోను..రాత్రివేళ ప్రత్యేక తారా విహార్ ప్రార్థనలు..జాగరణ రాత్రు లు..లోక కళ్యాణం కోసం ఐత్తే కాఫ్ ప్రత్యేక దీక్షలు.. అనంతరం ప్రత్యేక ప్రార్థన లు తరువాత రంజాన్ ఉపవాసదీక్షలువిరమింకున్నారు.. రంజాన్ పర్వదినం సందర్భంగా "వైరా మండల పరిధిలోని రెబ్బవరం గొల్లపూడి పాలడుగు విప్పలమడక గ్రామాలలోని మసీదుల వద్దకు ఉదయం ముస్లిం సోదరులు కొత్తబట్టలు ధరించి పెద్ద ఎత్తున హా జరై ఈద్ నమాజ్..ఈద్.. ఉల్..పితుల్ నమాజులు ముస్లింసోదరులందరూ నిర్వహించారు.ఈ సందర్భంగా మత పెద్దలు..రంజాన్ పర్వదిన విశిష్ట తను తెలిపే ఖురాన్ సందేశాన్ని వినిపించి ముస్లించే రంజాన్ ప్రార్థనలు చేయించా రు.రంజాన్ పర్వదినం ముస్లింలందరికీ అత్యంత ప్రీతికర మైందని..ముఖ్య మైందని వారు పేర్కొన్నారు.పరమత సహనం పాటించి అందరితో సోదరి భా వంతో మెలగాలని సూచించారు.ఆత్మ సంతృప్తితో అల్లాను ప్రార్థిస్తే కష్టాలన్నీ తొలగి శుభం చేపడుతుందని తెలిపారు.ప్రతి వ్యక్తి దానగుణం కలిగి ఉండాలని..తన కున్న దాంట్లో దానం చేయడమే గొప్ప లక్ష్యంగా భగవంతుడు పేర్కొ న్నారని గుర్తు చేశారు.మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు.సర్వ మతాల సారం ఒకటేనని..ఉపవాస దీక్షలు..ఆరాధన ప్రా ర్థనలు..వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ఉపవాసాలు ముఖ్య ఉద్దేశమన్నారు.ఈ పర్వ దినం రోజున ఉదయమే తమ సమీపంలోని మసీదుల వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజులో పాల్గొన్నారు.నమాజ్ ముగిసిన అనంత రంతమబంధుమిత్రులను ఆప్యాయంగా అలింగనం చేసుకొని తమఆప్యాయతలనుచాటుకున్నారు.చిన్నారులు సైతం అలింగనం చేసుకుని" పరస్పర శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు.ప్రతి ఒక్కరిని స్నేహ భావంతో పలకరి స్తూ ఈద్ ముబారక్ పండగ శుభాకాంక్షలు తెలియ జేశారు.రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఇరుగు..పొరుగు వారిని ముస్లింలు తమ ఇం టికి ఆహ్వానించి ప్రత్యేకంగా తయారు చేసిన సేమియా పాయసాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ రసూల్ ఉపాధ్యక్షులు షేక్ మీరా సాహెబ్ గౌస్ రెహమాన్ మేర షేక్ బాషా కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ నాయకులు డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ మునిసిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ టీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు ఉంద్రు శ్యాంబాబు జిల్లా నాయకులు బొర్ర రాజశేఖర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు వీరంశెట్టి సీతారాములు పొదిలి హరినాథ్ బి ఆర్ ఎస్ నాయకులుఅప్పం సురేష్" బాణాల వెంకటేశ్వర్లు నూకల ప్రసాదరావు "కొల్లా రాంబాబు మిట్టపల్లి కిరణ్ కుమార్ పోలూరు సైదులు వెళ్లి ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ సం దర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

## ముస్లింల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**మంత్రి కొండా సురేఖ**

**-ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి**



వరంగల్ ప్రతినిధి: మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్) : ఆధ్యాత్మిక పునరుద్ధరణ, హృదయ శుద్ధితోపాటు అల్లాహ్ క్రుపను పొందే పవిత్రమైన రంజాన్ పండుగగా భావిస్తారని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.శనివారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్ ఎల్బీనగర్ లో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నగరమేయర్ గుండు సుధారాణి తో కలిసి పాల్గొన్నారు.పోచమ్మ మైదాన్ నందు ఎల్బీ నగర్ ఈద్గాల్లో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సురేఖ ముస్లిం సోదర, సోదరీమణులను ఉద్దేశించి ప్రసంగించారు. పవిత్ర రంజాన్ మాసంలో నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు ఆచరించి,ఆధ్యాత్మికతతో పండుగ జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికీ ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అల్లాను ప్రార్థించినట్లు చెప్పారు.ఘన్ని అబ్దుల్ అజీజ్ ఎల్బీ నగర్ ఈద్గా అభివృద్ధికి రూ" 60 లక్షలు మంజూరు చేయడం జరిగింది.మత సామరస్యానికి ప్రతీకగా ఈ రంజాన్ వేడుకలు నిలుస్తాయని, సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తాయని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ ఫుర్ఖాన్,ఈద్గా అధ్యక్షులు మహమ్మద్ సాదిక్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా తోపాటు కమిటీ బాధ్యులు షేక్ హుస్సేన్ ఖాదర్,వాజిద్.డాక్టర్ అజిత్ మహమ్మద్,మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## మైనార్టీ సోదరులకు పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్





రాజేంద్రనగర్, మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్) : నర్కుడ గ్రామంలో రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు సర్పంచ్,శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నీరటి తన్విరాజు,ఉప సర్పంచ్ నీరటి మహేష్ ,మాజీ ఎంపీటీసీలు తొంట అశోక్,శ్రీనివాస్,వార్డు సభ్యులు,నర్కుడ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు చౌట శేఖర్,సీనియర్ నాయకులు నీరటి కృష్ణ, గుండాల విశ్వనాథ్,టి కుమార్,శివాజీ,అశోక్, వినోద్, సాయినాథ్, ప్రభు, సందీప్,శ్రీనాథ్,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..రంజాన్ పండుగ శాంతి, సౌభ్రాతృత్వం,త్యాగం మరియు సేవా భావానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో ఐక్యత,సోదరభావం పెంపొందించేందుకు ఈ పండుగ ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని పేర్కొన్నారు. అందరికీ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## సుల్తాన్ పల్లి మైనారిటీ సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ ఎల్లని ప్రభాకర్ గౌడ్,మాజీ సర్పంచ్ దండు ఇస్తారి



రాజేంద్రనగర్, మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్) : రంజాన్ పండుగ సందర్భంగా సుల్తాన్ పల్లి మైనారిటీ సోదరులు సిద్ధిక్ లను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియచేసిన సర్పంచ్ ఎల్లని ప్రభాకర్ గౌడ్,మాజీ సర్పంచ్ దండు ఇస్తారి,ఉప సర్పంచ్ దండు శివ కుమార్,వార్డు సభ్యులు,ఎల్లని రాజు గౌడ్,మనీషా జనార్ధన్, స్వప్న సిద్దయ్య,నాయకులు మైలారం రాజు,చింటూ,శ్యామ సాయి,మైలారం సిద్ధు,నీరటి సిద్ధు,మైలారం సిద్ధు,నీరటి సుధాకర్,తేరుపల్లి యాదయ్య,ఇటికపల్లి రవి,తదిరులు పాల్గొనడం జరిగిందన్నారు.

## అమ్మవారి సేవలో భాగస్వాములైన 17 కుటుంబాలకు అభినందించిన

**:కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

**--మాడవీధుల నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాల పంపిణీ.. కుడా చైర్మన్**



వరంగల్ ప్రతినిధి మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్) : ఓరుగల్లు ఆరాధ్యదైవం భద్రకాళి దేవాలయ అభివృద్ధి కోసం,మాడవీధుల నిర్మాణం నిమిత్తం తమ స్థలాలను స్వచ్ఛందంగా అప్పగించిన 17 నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున శనివారం న్యూ శాయంపేటలోని డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలను కుడా కార్యాలయంలో నిర్వహించిన లక్కీ డ్రా ద్వారా(కుడా)చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ ఛాహత్ బాజ్ పేయితో కలిసి పంపిణీ చేశారు.కలెక్టర్ ఛాహత్ బాజ్ పేయి లక్కీ డ్రా ద్వారా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేశారు.ఈ సందర్భంగా కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ భద్రకాళి దేవాలయ అభివృద్ధి నగరాభివృద్ధిలో అత్యంత కీలకమని, మాడవీధుల నిర్మాణం కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన కుటుంబాలకు ధన్యవాదాలు తెలిపారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బాధితులకు తక్షణమే గృహ వసతి కల్పించాలనే పట్టుదలతో ఈ ప్రక్రియను వేగవంతం చేశామని ఆయన పేర్కొన్నారు. మాడవీధుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్వాసిత కుటుంబాలకు ఎటువంటి అన్యాయం జరగకుండా, వారికి మెరుగైన వసతులు కల్పిస్తామని, ఆధ్యాత్మిక నగరిగా వరంగల్‌ను తీర్చిదిద్దడంలో ఇదొక గొప్ప ముందడుగని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధికి సహకరించిన బాధితులకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, కుడా ఆధ్వర్యంలో మాడవీధుల పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కుడా అధికారులు పీవో అజిత్ రెడ్డి,ఈఈ భీమ్ రావు,మరియు సంబందిత అధికారులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.



# బడ్జెట్ లో జర్నలిస్టుల ప్రస్తావన ఊసే లేదు

**జర్నలిస్టులపై ప్రభుత్వం వైఖరి బహిర్గతం ఒక శిర చుక్క కోటి మొదళ్లకు కదలిక ప్రభుత్వం పై సమరశీల పోరాటానికి సిద్ధం**

**టీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు షక్కెర రామచంద్రయ్య**



మహబూబునగర్ మార్చి 22 (జర్నలిస్ట్ ఫైల్) : వనపర్తి జిల్లా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ లో రాష్ట్రంలోని జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలు డిమాండ్లు ఆవిష్కృతంగా ఉన్న అనేక సమస్యలపై ఈ ప్రభుత్వం ఎలాంటి ప్రస్తావనే చెయ్యకపోవడం జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం యొక్క ఉదాసీన వైఖరి బహిర్గతమైందని రాష్ట్ర టీయూడబ్ల్యూజేఎఫ్ కౌన్సిల్ సభ్యుడు షక్కెర రామచందర్ ఆరోపించారు. జర్నలిస్టుల సమస్యలపై అతి ప్రధానమైన సమాచార శాఖ ను ప్రభుత్వం మరచిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మీడియా అకాడమీ గురించి రాష్ట్ర బడ్జెట్ లో ప్రస్తావన చేయకపోవడం బాధాకరమని అన్నారు. ఈ రాష్ట్ర బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం కోసం నిధులను కేటాయించకుండా సంక్షేమ కార్యక్రమాలను ఎలా అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు.? తరాలు మారిన తలరాతలు మారిన జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లు ఇండ్ల స్థలాల గురించి కూడాచర్చకు రాలేదని.ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత జర్నలిస్టులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు కాలం గడిచిన ఇప్పటివరకు కనీసం జర్నలిస్టులకు ఇవ్వవలసిన అక్రిడిటేషన్ కూడా ఇవ్వడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. అక్రిడేషన్ కార్డులను రెండు యేండ్లుగా గడువును పొడిగించుకుంటూ పోతుందని కాలం గడుపుతుందని ఆయన ఎద్దేవ చేశారు. ఇది అన్యాయం కాదా అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరినా సర్కార్ స్పందించలేదు.వేలాది మంది జర్నలిస్టులు బడ్జెట్ పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అంతేకాక రాష్ట్రంలో ఉత్తమ జర్నలిస్టు అవార్డు ల ప్రస్తావనే తేలేదు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాజం దృష్టికి తీసుకుపోతున్న మీడియా పట్ల పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తున్నది. అక్రిడిటేషన్స్, ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మహిళా జర్నలిస్టుల సమస్యలపై బడ్జెట్ లో రేఖామాత్రంగా కూడా ప్రస్థావించికపోవందం అన్యాయం. ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలు ముఖ్యమంత్రి హామీ ని సైతం బడ్జెట్ లో చెప్పకపోవడం జర్నలిస్టులను ఆవేదన, ఆందోళన కు గురిచేస్తున్నది. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు రామచందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ పదవి బాధ్యతలను రెండోసారి రెడ్డి సామాజిక వర్గానికి కట్టబెట్టి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించవలసిన చైర్మన్ జర్నలిస్టుల ఆత్మ గౌరవాన్ని తాకట్టుపెట్టి సమస్యలను చెత్తబుట్లో వేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించలేని ప్రెస్ అకాడమీ చైర్మన్ వైఫల్యం వల్లనే నేటికీ ఇండ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, జర్నలిస్టులు సాధించుకోలేకపోతున్నారని గత ప్రభుత్వం హయాంలో 100 కోట్ల బడ్జెట్ కేటాయిస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం మాయమాటలు చెప్పి జర్నలిస్టు సంక్షేమానికి కేవలం 30 కోట్ల రూపాయలు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకున్న సంగతి కూడా ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దొందు దొందుగానే జర్నలిస్టు సమస్యల పట్ల జర్నలిస్టుల పట్ల చిన్నచూపు చూస్తున్నాయని రామచందర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ విషయంలో రాష్ట్రవ్యాప్తంగా టి డబ్ల్యూ జె ఎఫ్ ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య, యాక్టివ్ ప్రెసిడెంట్ పి. రామచందర్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు. ఈ విషయంపై రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను జాగృతం చేస్తూ ప్రభుత్వం అవలంబిస్తున్న జర్నలిస్టు వ్యతిరేక విధానాలను ఎండగట్టి తీరుతామని షక్కెర రామచంద్రయ్య ఈ సందర్భంగా అన్నారు.

## జనసైనికుడు కుటుంబానికి ప్రమాద భీమా 5లక్షలు బాండు అందజేసిన మంత్రి నాదెండ్ల



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** జనసేన క్రియాశీలక సభ్యుడు కొంద్రుసాయి కుమార్ ప్రమాదవాశాత్తు మరణించిన క్రమంలో సాయికుమార్ కుటుంబ సభ్యులను పార్టీ రాజకీయవ్యవహారాల కమిటీ చైర్మన్,రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరామర్శించారు.

ఆదివారం స్థానిక పినపాడులోని కొంద్రు సాయి కుమార్ నివాసానికి చేరుకున్న జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సాయి కుమార్ చిత్రపటానికి పూల దండ వేసి నివాళు లర్పించిన మంత్రి మనోహర్, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. జనసేన పార్టీ తరఫున రూ. 5లక్షల,ప్రమాద బీమా పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. సాయి కుమార్ పార్టీకి అందించిన సేవలను గుర్తుచేసుకున్న, మంత్రి మనోహర్ ,ఇటువంటి క్లిష్ట సమయంలో కుటుంబానికి మనోధైర్యం కలగాలని, సాయి కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. మంత్రి మనోహర్ వెంట పార్టీ స్థానిక నాయకు లున్నారు.

## సోనోవిజన్ షోరూమ్ చోరీ కేసులో బాలనేరస్తులు అరెస్ట్



- చోరీ సొత్తు రికవరీ
- డిఎస్పీ బి. జనార్ధనరావు

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని సోనోవిజన్ షోరూమ్ లొ ఈ నెల 15 వ తేదీన విలువైన సెల్ ఫోన్ల భారీ చోరీ కేసును పట్టణ టు టౌన్ పోలీసులు ఛేధించారు. నిందితులు ముత్యంశెట్టిపాలెం, చినరావూరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు మైనర్ బాలురుగా గుర్తించామని డిఎస్పీ బి.జనార్ధనరావు పేర్కొన్నారు.డిఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చోరీ కేసు వివరాలను డిఎస్పీ జనార్ధన రావు వివరించారు.ఈనెల 15వ తేదీ ఆదివారం అర్ధరాత్రి సోనోవిజన్ షోరూమ్ లో చోరీ జరిగినట్లు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, టుటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేయగా చోరీకి పాల్పడింది ఇద్దరు మైనర్లుగా గుర్తించినట్లు డీఎస్పీ జనార్ధనరావు వారి వివరాలుతెలిపారు.

ముత్యంశెట్టి పాలెంకు చెందిన 17ఏళ్ల బాలుడు చినరావూరు కు చెందిన 16ఏళ్ల బాలుడు చెడు వ్యసనాలకు బానిసలై వరుస చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.వీరిలో 17ఏళ్ల బాలుడు పై గతంలో అనేక చోరీ కేసులు ఉన్నాయని, అరెస్టు కాబడి జువైనల్ హోమ్ లో కూడా శిక్ష అనుభవించి వచ్చాడని చెప్పారు.అయినప్పటికీ తీరు మార్చుకోకుండా, చినరావూరుకు చెందిన మరో 16ఏళ్ల బాలుడుతో కలిసి చోరీలకు పాల్పడుతున్నాడని తెలిపారు.షోరూం పక్కనే ఉన్న, బిర్యాని రెస్టారెంట్లో కొద్దిరోజులు 17ఏళ్ల బాలుడు పనిచేసాడని,చోరీ కోసం రెక్కీ చేసినట్లు విచారణలో తేలిందని అన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరు మైనర్ నిందితులను అరెస్ట్ చేసి రూ. 12 లక్షల విలువైన సెల్ ఫోన్లు,స్మార్ట్ వాచ్లు,ఐప్యాడ్లు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ జనార్ధన రావు చెప్పారు. ఎంతో చాకచక్యంగా కేసు చేదించిన టూ టౌన్ సీఐ రాములు నాయక్,ఎస్సై నాగరాజులను అభినందించారు.

## శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలు



**పెదనందిపాడు, (జర్నలిస్ట్ ఫైల్ ):** పెదనందిపాడు మండల కేంద్రంలో పెదనందిపాడు శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా చక్రవర్తి జయంతి వేడుకలు నిర్వహించారు.

ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. తదుపరి కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాలివాన చక్రవర్తి అంటే భారతదేశ తెలుగు చక్రవర్తి ప్రథమ తెలుగు చక్రవర్తి అని అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు శాలివాహన మహారాజ్ కు ఒక చరిత్ర ఉందని అన్నారు. అలాంటి మహారాజు మన కులంలో పుట్టడం గర్వకారణం అని తెలిపారు. శాలివాహ చక్రవర్తికి ఘన చరిత్ర ఉందని తెలిపారు.

అందుకనే ఆయనని మర్చిపోకూడదని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నిజాంపట్నం సుబ్బారావు, ఉపాధ్యక్షుడు కానుగుల నాగభూషణం, చల్లగిరి వెంకటేశ్వరరావు, చల్లగిరి పకీరరావు, నిజాంపట్నం రాంబాబు, నిజాంపట్నం వెంకటేశ్వర్లు, శివాజీ, గోపి, నాగేశ్వరావు, రమేష్, అప్పారావు, రాజు, కాకుమాను ఏడుకొండలు, వెంకటేష్, శాలివాహన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సుభిక్షపాలన : ఎమ్మెల్యే నసీర్

- యువత కలలు కూటమితో సాకారం
- జగన్ పాలనలో అవినీతి అరాచకం
- అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా సీఎం చంద్రబాబు నిర్ణయాలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగుతోందని, అన్ని రంగాల ప్రజలు సంతోషంగా ఉన్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. యువత కలలను సాకారం చేసేలా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంపై ఆదివారం ఒక ప్రకటనలో ఆయన హర్షం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ లో ప్రధానంగా విద్య, పోలీసు శాఖలకు ఎక్కువ పోస్టులు కేటాయించారని, రాష్ట్రంలో శాంతిభద్రతలకు పెద్ద పీట వేయడమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందని చెప్పారు. విద్యా రంగం బలోపేతం చేయడం ద్వారా అన్ని యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించే దిశగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. పరిపాలన విభాగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రూప్ -1, గ్రూప్-2 పోస్టులు కేటాయించడం గమనించదగిన విషయమని పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదల నుంచి పరీక్షల తేదీలు, నిర్వహణ వంటి అంశాలను వెల్లడించారని, దీంతో నిరుద్యోగులకు ఎలాంటి కన్ఫ్యూజన్ లేదని తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ పేరిట జగన్ నిరుద్యోగ యువతను దగా చేశారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో కమీషన్ల కక్కుర్తితో రాష్ట్రానికి పరిశ్రమలను రాకుండా తరిమికొట్టారని, దీంతో 34 లక్షల మంది యువత జీవితాలను నాశనం చేశారని విమర్శించారు. జగన్ పాలన అంతా అవినీతి, అరాచకాలతో సాగిందని, చంద్రబాబు నాయుడు పాలన వికాసం వైపు పయనిస్తోందని ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక మౌళిక వసతుల కల్పన

- నారా లోకేష్ సహకారంతో 9 పాఠశాలలో అభివృద్ధి పనులు
- 90 లక్షలతో డియాజియో సంస్థ ద్వార ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు





**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్):** సుమారు 18 కోట్ల రూపాయలతో జర్మన్ టెక్నాలజీ అంతర్జాతీయ ప్రమాణాలతో నిడమర్రు జెడ్పి హైస్కూల్ పనులు పూర్తికాగా ప్రారంభోత్సవానికి సిద్ధమౌతుంది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా నారా లోకేష్ అడుగులు వేస్తున్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా తన సొంత నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి బాట పట్టిస్తున్నాడు. మంత్రి నారా లోకేష్ సహకారంతో డియోజియో సంస్థ ఆర్థిక సహకారం తో 90 లక్షల రూపాయల నిధులతో 9 ప్రభుత్వ పాఠశాలలో ఆధునీక నిర్మాణాలతో మౌళిక వసతులు కల్పించారు. అయా ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక మరుగుదోడ్లు , చేతులు శుభ్రం చేసుకునేందుకు మంచి నీటి కుళాయిలు, వాటర్ ప్యూర్ఫైయర్ చిల్లర్, ఏర్పాటు చేయించారు. షెడ్లు, మోటార్లు, ఖాళీ స్థలాలలో గ్రావెల్ తో మెరక వేయించారు. . విద్యార్థిని విద్యార్థులు కూర్చునేందుకు ఆధునిక బల్లలు, పాఠశాలలో రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ఫ్లోరింగ్, మరుగుదోడ్లకు మరమ్మతులు చేయించి అధునీకరించారు. మంగళగిరి మండలం నవులూరు మక్కెవారిపేట ప్రాధమిక పాఠశాల గది తలుపులు, కిటీకిలు, ప్రహరిగోడ నిర్మాణం, వాష్ బేషన్, చేతులు శుభ్రం చేసుకునేందుకు కుళాయిలు ఏర్పాటు చేశారు. ఆధునికరించిన మరుగుదోడ్లుకు రంగులు వేయించారు.

దుగ్గిరాల మండలంలోని ఈమని గ్రామ ప్రధాన ప్రాథశాల అయా పనులతో పాటు షెడ్ నిర్మించటంతో పాటు ఖాళీ స్థలంలో చదునుగా గ్రావెల్ వేయించారు. దుగ్గిరాల సుగాలీ కాలనీ ప్రభుత్వ పాఠశాల, మంగళగిరి మండలం కురగల్లు, చినకాకాని కాజ వెంకటరెడ్డి పాలెం,ఆత్మకూరు వడ్డెరపాలెం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరిచారు. తాడేపల్లి మండలం కొలనుకొండ ప్రభుత్వ పాఠశాలలో అదనంగా అల్యూమినియంతో తయారు చేసిన నూతన తరగతి గదిని నిర్మించారు. రానున్నకాలంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 అసిస్టెంట్ గవర్నర్‌గా గాజుల




**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు (2024-2025) గాజుల శ్రీనివాసరావు అసిస్టెంట్ గవర్నర్ గా నియామకం పొందారు. శనివారం నేపాల్ రాజధాని ఖాట్మండు లో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో గాజుల శ్రీనివాసరావుకు పిన్ ప్రజెంటేషన్ ఘనంగా జరిగింది. వృత్తిరీత్యా స్వర్ణకార రంగంలో ఉన్న గాజుల శ్రీనివాసరావు స్వర్ణకారుల అభ్యున్నతి, సంక్షేమం కాంక్షిస్తూ మంత్రి నారా లోకేష్ సహకారంతో నడుస్తున్న ఎల్ ఎన్ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గానూ సేవలు అందిస్తున్నారు.

మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా అందించిన స్ఫూర్తిదాయక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా గాజుల శ్రీనివాసరావుకు ఆంధ్ర రీజియన్ లో బెస్ట్ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా అవార్డు అందుకోవటం వీరి లోని సమర్థ నాయకత్వానికి, సేవా గుణానికి నిదర్శనంగా చెప్పవచ్చు. తాజాగా రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 లో అసిస్టెంట్ గవర్నర్ (2026-2027)గా నియామకం పొందిన గాజుల శ్రీనివాసరావు పరిధిలో మంగళగిరి రోటరీ క్లబ్ తోపాటు గుంటూరు సెంటీనియల్, పొన్నూరు, బాపట్ల రోటరీ క్లబ్ లు ఉంటాయి. అసిస్టెంట్ గవర్నర్ గా గాజుల శ్రీనివాసరావు నియామకంపై మంగళగిరి రోటరీ చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి ఇసునూరు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రగడ రాజశేఖర్, కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, కోశాధికారి కె.వి.ఎస్. ప్రకాశరావు, పూర్వ కార్యదర్శి అందే మురళీమోహనరావు, పలువురు రొటేరియన్లు హర్షం వ్యక్తం చేశారు.

## అధికారుల నిర్లక్ష్యంతో పునఃప్రారంభానికి నోచుకోని పాత అంబేద్కర్ గురుకులం

- మండల కేంద్రంలోని పాత గురుకులాన్ని యదావిధిగా కొనసాగించాలి
- సిపిఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్):** అంబేద్కర్ గురుకులం అధికారుల నిర్లక్ష్యం వల్ల మండల కేంద్రంలోని పాత అంబేద్కర్ గురుకుల పాఠశాల పునఃప్రారంభానికి నోచుకోలేదని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ ఆరోపించారు. ఆదివారం సిపిఐ బృందం పాత గురుకుల పాఠశాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండల కేంద్రము పరిధిలో ఎస్సీ జనాభా ఎక్కువగా ఉండటం కారణంగా పాత గురుకుల పాఠశాలను పున ప్రారంభించాలని ఆయన అన్నారు. పాత అంబేద్కర్ గురుకుల పాఠశాల భవనం అధికారుల నిర్లక్ష్యం వల్లనే పాఠశాల పునఃప్రారంభానికి నోచుకోలేదని అయన ఆరోపించారు. విద్యార్థులను మహా గురుకులం కీ తరలించేటపుడు అధికారులు పాత గురుకులాన్ని మరల ప్రారంభిస్తామని ఈ గురుకులం ఎంతోమంది పేద విద్యార్థులకు ఉన్నత స్థాయికి వెళ్లేందుకు మంచి క్రమశిక్షణ, నడవడిక నేర్పిందని, ఈ భవనం 1988 లో ప్రారంభించారని అప్పటినుండి పాఠశాల ఎంతోమంది పేద విద్యార్థులు అక్కడ చదువుకోవడం మంచి విద్యాబోధనతో చక్కటి వాతావరణం లో పుణ్యక్షేత్రంలో ఈ పాఠశాల నడిచేదని అధికారులు, రాజకీయ నేతలు తిరిగి మళ్లీ అదే పాఠశాలను అక్కడ ప్రారంభించేందుకు ప్రభుత్వానికి నివేదికను పంపించామని మాటలు చెప్పారని, ప్రస్తుతం పాఠశాలకు మరమత్తు పనులు కొన్ని భవనాలకు పనులను చేపించి మరల పాత గురుకుల పాఠశాలలో తరగతులను ప్రారంభించేందుకు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెల్లి పాఠశాలను పునః ప్రారంభించాలని అయన తెలిపారు. మహా గురుకుల పాఠశాలలో 700 విద్యార్థులు ఉన్నారని ఐదో తరగతి నుండి, ఇంటర్ వరకు విద్యార్థులు చదువుతున్నారన్నారు. విద్యార్థులకు వసతులు సరిగ్గా లేవని వర్కర్ ల కొరత ఉందని, జిల్లా అధికారులు వర్కర్ల కొరత లేకుండా విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, వసతి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే విద్యా సంవత్సరంలో పాత గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించకపోతే ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు.

## పి.జి.ఆర్.ఎస్ అర్జీల స్థితిని 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు



- మీకోసం వెబ్ సైట్ లో అర్జీలు సమర్పించవచ్చు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో సమర్పించిన ఆర్జీల స్థితిని 1100 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. "మీకోసం" వెబ్ సైట్ లో ఆన్ లైన్ లో ప్రజలు అర్జీలు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ అన్నారు. పి.జి.ఆర్.ఎస్ తో పాటు నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ లను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతి సోమవారం పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ లను ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించేందుకు జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. మండలాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేసి, ప్రజల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించి నమోదు చేయడంతో పాటు, సమస్యల స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

**మీకోసం వెబ్ సైట్ లో అర్జీలు సమర్పించవచ్చు**

ప్రజలు తమ సమస్యలను మీకోసం వెబ్ సైట్ లోను అర్జీలు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ చెప్పారు. అర్జీల వివరాలు (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పి.జి.ఆర్.ఎస్ ను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## కాటూరి సుబ్బారావు నిర్మించే భవనాల స్థలాల పరిశీలన



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** కాకుమాను మండలం కొండపాటూరులో కాటూరి మెడికల్ కాలేజీ హాస్పిటల్ అధినేత కాటూరి సుబ్బారావు చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించిన స్థలాల పరిశీలనకు ఆదివారం సివిల్ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు . హైస్కూలు భవన నిర్మాణానికి కాటూరి సుబ్బారావు కోటి రూపాయలను డిపాజిట్ చేసిన నేపథ్యంలో అందుకు ఎలిమెంటరీ స్కూలు పక్కన గల స్థలాన్ని పరిశీలించారు.

పది గదులు నిర్మించడానికి సరిపోయిన విధంగా స్థలం ఉండటంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. దాని పక్కనేగల కమ్యూనిటీ హెల్త్ సెంటరును కూడా రూ. ఐదు లక్షలతో మరమ్మతులు చేయిస్తానని సుబ్బారావు హామీ ఇచ్చినందున దాన్ని కూడా పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఈ భవనం బాగుచేయుటకు ఏమేమి కావాలనేదాని కోసం కొలతలువేశారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాలును కూడా తమ సొంత నిధులతో నిర్మించి ఇస్తానని సుబ్బారావు హామీ ఇచ్చినందున దానికి కేటాయించిన స్థలాన్ని కూడా పరిశీలించారు. 20 సెంట్లకు పైగానే ఖాళీ స్థలం ఉండటంతో భవనం ఏ వైపు నిర్మించాలనే దానికోసం నలువైపుల కొలతలు తీశారు. అప్పాపురం నుంచి కొండపాటూరులో ప్రవేశం మొదట్లో ఉన్న ఈ స్థలం వాస్తు ప్రకారం అన్ని విధాలుగా అనువుగా ఉందని నిర్మించబోయే కమ్యూనిటీ భవనం పర్యవేక్షక బాధ్యతలు చూస్తున్న తరిగోపుల సూరిబాబు సంతృప్తిని వ్యక్తం చేశారు. కమ్యూనిటీ భవనానికి ప్రభుత్వం ఈ స్థలం కేటాయించినప్పటికీ ఏళ్ల తరబడి అది ఖాళీగానే ఉందని, కాటూరి సుబ్బారావు గొప్ప మనసుతో దీన్ని లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించడానికి చొరవ చూపినందుకు ఆయనకు రుణపడి ఉంటామని ఎస్సీ కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు. ఈ స్థలాల పరిశీలన కార్యక్రమాలలో సివిల్ ఇంజినీరు ప్రవీణ్, కాటూరి హరిబాబు, గన్నపనేని రాఘవరావు, టి.డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ సహకారముతో సోమిరెడ్డి పల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని సోమిరెడ్డి పల్లె గ్రామంలో బి మఠం మండల టిడిపి అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి మరియు సొసైటీ చైర్మన్ ఎల్లటూరి సాంబశివారెడ్డి 25లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్ కి ఆదివారం భూమి పూజ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూజ శివయ్య మేకల సుధాకర్ గంగిరెడ్డి చిలమల నాగయ్య శ్రీను, భాస్కర్ వీరయ్య ,శివ,గంగరాజు మరియు అధికారులు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# మంత్రి నారా లోకేష్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులకు ఉచిత మెగా వైద్య శిబిరం

- శిబిరంలో 530 మంది పార్టీ శ్రేణులకు వైద్య సేవలు



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి పట్టణంలోని ఈద్గా మస్జిద్ షాదీఖానా ఫంక్షన్ హాలులో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళగిరి నియోజకవర్గంలో 530 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స పొందారు. ఎక్కువ సంఖ్యలో శిబిరానికి పార్టీ నాయకులు తరలి రావడంతో ప్రాంగణం కిక్కిరిసింది. వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నాయకులు చర్యలు తీసుకున్నారు. పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా ఓపీలు, బీపీ, షుగర్, పి.ఎఫ్.టి, ఈసిజీ, ఎకో, బీ.ఎమ్.డీ, ఫైబ్రో వంటి స్కాన్‌లు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ యలవర్తి కార్తిక్ చౌదరి, గుండె వైద్య నిపుణులు డాక్టర్ నవీన్ కృష్ణ పెద్ది, మెదడు, నరముల వైద్య నిపుణులు డాక్టార్ మీనా సి.హెచ్, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ భరత్ చంద్ర కాట్రగడ్డ, జీర్ణవ్యవస్థ వైద్య నిపుణులు డాక్టర్ చైతన్య కాట్రగడ్డ, స్త్రీ మరియు ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ వసంతి దాసరి, జనరల్ మెడిసిన్ మరియు సాంక్రమిక వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ నీరెన్ రావెల పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు చేపట్టారు.

ఈ సందర్భంగా డాక్టర్ యలవర్తి కార్తిక్ చౌదరి మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ సూచనలతో పార్టీ శ్రేణులకు ప్రత్యేక మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మొదటి సారిగా పార్టీ నాయకుల కోసం మంగళగిరిలో మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగిందని చెప్పారు. నాయకుల యొక్క హెల్త్ డేటా మొత్తం పార్టీ మెంబర్ షిప్‌తో అనుసంధానించి వారికి సరైన సమయంలో వైద్యం అందేలా మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నాయకులు, కార్యకర్తలకు మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తామని అన్నారు. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు మంత్రి నారా లోకేష్ చేస్తున్న ప్రజాసేవకు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ తమవంతు కర్తవ్యంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు.

రమేష్ హాస్పిటల్ కార్పొరేట్ వైద్య సేవలు అందించాలని సంకల్పంతో గ్రామాలు, పట్టణాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుందన్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని రమేష్ హాస్పిటల్ 20 ఏళ్లకు పైగా కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ అక్రమ్, మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, దుగ్గిరాల మండల పార్టీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, మంగళగిరి మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సరెండర్ లీవ్ బిల్లులు వెంటనే చెల్లించాలి: ఆప్టా డిమాండ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ లీవ్ బిల్లులు 2022 నుంచి ఇప్పటివరకు చెల్లింపులు జరగకపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) పేర్కొంది. ఈ బిల్లులను వెంటనే చెల్లించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు లేఖ ద్వారా ఆప్టా ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

సరెండర్ లీవ్ బిల్లులపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇప్పటికే ఆదాయపు పన్ను చెల్లించినప్పటికీ, నాలుగేళ్లుగా చెల్లింపులు నిలిచిపోవడం అన్యాయమని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం జి మెహది తెలిపారు. ప్రభుత్వం మారిన తరువాత అయినా బకాయిలు చెల్లింపులు జరుగుతాయని ఆశించినా, ఆ ఆశలు నెరవేరలేదని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా బిల్లులను మళ్లీ రీన్యువల్ చేయడం జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని, కనీసం ఇప్పటికైనా పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలాగే ప్రస్తుత ప్రభుత్వం కూడా సమస్యను పట్టించుకోకపోతే సహించబోమని హెచ్చరించారు.

అలాగే పీఆర్‌సీ కమిటీ, ఐఆర్ ప్రకటన, ఇతర బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని కోరారు. ఉద్యోగ సంఘాలు రోడ్డెక్కే పరిస్థితి రాకముందే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులకు అనుకూలంగా కేవలం ప్రకటనలు కాకుండా ఆచరణలోనూ చూపించాలని ఆప్టా నాయకులు స్పష్టం చేశారు.

## గురుకుల సొసైటీ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు పెంపుపై హర్షం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్‌లో గురుకుల సొసైటీలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ సిబ్బంది పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ తీసుకున్న నిర్ణయాన్ని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ హర్షించింది. ఈ నిర్ణయానికి సంబంధించి త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) వెలువడనున్నాయి.

రాష్ట్రంలో ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలుగా అమలులో ఉండగా, ప్రభుత్వ రంగ సంస్థలు మరియు గురుకుల సొసైటీ పాఠశాలల సిబ్బందికి కూడా ఇదే వర్తింపజేయాలనే డిమాండ్ చాలా కాలంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సముచితమని సంఘం పేర్కొంది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, మున్సిపల్ శాఖ మంత్రి పీ. నారాయణలకు అసోసియేషన్ రాష్ట్ర శాఖ తరఫున అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

ఈ అంశంపై అనేకసార్లు ప్రభుత్వానికి ప్రతినిధులు పంపి, వినతిపత్రాలు అందజేసినట్లు సంఘం తెలిపింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మరోసారి ఈ నిర్ణయం ద్వారా స్పష్టమైందని రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు వెల్లడించారు.

## గోదావరిలో మునిగి ముగ్గురు విద్యార్థుల మృతి.. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ సంతాపం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** శుక్రవారం ఉదయం కుకునూరు సమీపంలోని గోదావరి నదిలో జరిగిన ప్రమాదంలో యూనివర్సిటీకి చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో బాధిత కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపింది.

సెలవుల సందర్భంగా అనుమతి పొందిన అవుట్‌పాస్‌లపై భద్రాచలం వెళ్లిన ముగ్గురు విద్యార్థులు గోదావరి నదిలోకి దిగగా, లోతైన ప్రవాహంలో చిక్కుకుని మునిగిపోయినట్లు యూనివర్సిటీ పేర్కొంది. ఈ దురదృష్టకర ఘటనలో ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్లు ధృవీకరించినట్లు వెల్లడించింది.

ఈ ఘటనపై యూనివర్సిటీ తీవ్ర విషాదాన్ని వ్యక్తం చేస్తోందని, విద్యార్థుల మృతితో క్యాంపస్ అంతా శోకసంద్రంలో మునిగిపోయిందని వైస్ చాన్స్‌లర్ కార్యాలయం తెలిపింది. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని భరించే ధైర్యం కలగాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొంది.

ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని, నీటి వనరుల వద్ద అప్రమత్తంగా ఉండాలని యూనివర్సిటీ సూచించింది.

## ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర కార్యవర్గం పదవీకాలం ముగియడంతో జిల్లా స్థాయి ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్, ప్రధాన కార్యదర్శి సీఎం దాస్ తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇటీవల ఎన్నికల అధికారులుగా దామా నాగేశ్వరరావు, కాటసాని శివారెడ్డి, తూముల సూర్యారావు, రొయ్యల నాగ దుర్గారావులను నియమించినట్లు గుర్తుచేశారు. వారి సూచనలు, సలహాల మేరకు సంఘ బైలాస్ ప్రకారం జిల్లాల ఎన్నికలను ఏప్రిల్ 20, 2026 నాటికి విజయవంతంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను సాఫీగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. గత రెండు సంవత్సరాలుగా సంఘానికి మద్దతు అందించిన సభ్యులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## సొసైటీలు, గురుకులాలు, కార్పొరేషన్లలో పదవీ విరమణ వయస్సు పెంపుపై ఎంఎస్పీటీఏ హర్షం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రంలోని వివిధ గురుకులాలు, సొసైటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచిన నిర్ణయంపై మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ (ఎంఎస్పీటీఏ) హర్షం వ్యక్తం చేసింది.

ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షఫీ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నిర్ణయం ఉద్యోగుల సంక్షేమానికి దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.

అయితే, ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న రెగ్యులర్ ప్రభుత్వ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును కూడా వెంటనే 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని ప్రభుత్వాన్ని వారు కోరారు.

ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సహా సంబంధిత మంత్రివర్గ సభ్యులకు అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది.

## రాష్ట్ర పండుగగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి : మంత్రి సవిత

- నేడు రాష్ట్ర వ్యాప్తంగా దొమ్మేడి జయంత్యోత్సవం
- రాజమండ్రిలో రాష్ట్ర స్థాయి జయంతి
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం
- సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :కోనసీమలో అట్టడుగు వర్గాల విద్యాభివృద్ధికి, వారి ఆత్మగౌరవం కోసం పోరాడిన యోధుడు దొమ్మేటి వెంకటరెడ్డి అని, ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా, అధికారికంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. శెట్టి బలిజల పితామహుడిగా పేరుగాంచిన వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగ నిర్వహించాలని నిర్ణయించడంపై సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు ఆమె ధన్యవాదాలు తెలియజేస్తూ, ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోనసీమ ప్రాంతానికి చెందిన స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి... శెట్టి బలిజ సమాజంలో విద్య, ఐక్యత, ఆత్మగౌరవం కోసం విశేషంగా కృషి చేసిన గొప్ప సంస్కర్తని కొనియాడారు. విద్య ప్రాముఖ్యతను చాటిచెప్పి, సామాజిక చైతన్యానికి బాటలు వేశారన్నారు. కోనసీమలో అట్టడుగు వర్గాల విద్యాభివృద్ధికి, ఆత్మగౌరవం కోసం పోరాడిన యోధుడన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వ-యోజన విద్యకు కృషి చేసిన మేధావి అని కొనియాడారు. ఆయన చేసిన సేవలను భవిష్యత్తరాలకు తెలియజేయాలన్న లక్ష్యంతో దొమ్మేటి జయంతిని అధికారికంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారన్నారు.

ఎన్నికల ముందు నిర్వహించిన పాదయాత్రలో దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని అప్పట్లో మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రతి ఏటా మార్చి 23న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించనున్నారన్నారు. సోమవారం రాజమండ్రిలో దొమ్మేటి వెంటకరెడ్డి రాష్ట్రస్థాయి జయంతిని నిర్వహించనున్నట్లు తెలిపారు. మాట తప్పని నాయకుడంటూ మంత్రి లోకేశ్ పై మంత్రి సవిత ప్రశంసలు కురిపించారు. శెట్టి బలిజల పితామహుడిగా పేరుగాంచిన దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహించడంపై ఆ ప్రకటనలో సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్ కు ధన్యవాదాలు తెలియజేశారు.

## ఉగాది పురస్కార గ్రహీతలను ఘనంగా సత్కరించిన చీఫ్ విప్ జీవీ



**వినుకొండ ( జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్ర స్థాయిలో వినుకొండ నియోజకవర్గ కీర్తిని చాటిన ప్రతిభావంతులకు స్థానికంగా ఘన సన్మానం జరిగింది. ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఇరువురు ఆర్టిస్ట్, ఫోటోగ్రఫీలో అవార్డు అందుకున్న మరో ఇద్దరు విజేతలను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు వినుకొండలోని తన కార్యాలయంలో ప్రత్యేకంగా గౌరవించారు.

శివశక్తి లీలా & అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఎక్సలెన్స్ అవార్డులు 2026" కార్యక్రమంలో భాగంగా ఈ సన్మానం జరిగింది. వెడ్డింగ్ ఫోటోగ్రఫీలో కేసనపల్లి సుబ్బారావు, ఆర్టిస్ట్ బొద్దుచర్ల ప్రసాదరావు, పెయింటింగ్ రంగంలో డా. వజ్రగిరి జస్టిస్, అంతర్జాతీయ స్థాయి ఫోటోగ్రఫీలో బ్రహ్మయ్య వంగపల్లి లు పురస్కారాలు పొందారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతాలను జీవీ ఆంజనేయులు శాలువాలతో సత్కరించి, ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ రాష్ట్రం గుర్తించిన వినుకొండ ప్రతిభను స్థానికంగా గౌరవించు కోవడం గర్వకారణమని, ఇలాంటి ప్రోత్సాహం మరిన్ని కొత్త పురస్కారాలు, అవార్డులకు బాటలు వేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టౌన్ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు.

## ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సంపాని శ్రీనివాసరావు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సంపాని శ్రీనివాసరావు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం తాడేపల్లిలోని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏపీ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యులుగా ఉన్న ఈ సంఘం ఎన్నికలకు ఏపీ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు ఎన్నికల అధికారిగా, నాలుగవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర వైస్ చైర్మన్ ఎస్ మల్లేశ్వరరావు పరిశీలకుడిగా వ్యవహరించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్న నామినేషన్ ప్రక్రియలో కాకినాడ జిల్లాకు చెందిన దేవాదాయ శాఖ డ్రైవర్ సంపాని శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్నిక అనంతరం నిర్వహించిన అభినందన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్, రెవెన్యూ సర్వీసెస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జేఏసీ అమరావతికి కీలక భాగస్వామిగా నిలుస్తోందన్నారు. సంఘం ఐక్యతతో నాయకుడిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి (ఐఆర్), పెండింగ్ డీఏలు వంటి ఆర్థిక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని, ఇందుకోసం ఇతర సంఘాలతో కలిసి కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టీవీ ఫణి పేర్రాజు మాట్లాడుతూ, అన్ని జిల్లాల నాయకత్వం సహకారంతో ఎలాంటి అంతరాయం లేకుండా ఎన్నికలు విజయవంతంగా నిర్వహించగలిగినట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా జేఏసీ అమరావతితో కలిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమానికి లేబర్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి కిషోర్ కుమార్, గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి ఆర్లయ్య, ఏపీ జేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ తదితరులు హాజరయ్యారు.

## పౌర గ్రంథాలయ శాఖలో ఆర్థిక సంక్షోభం తీవ్రం

- ఆంధ్రప్రదేశ్ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలోని పౌర గ్రంథాలయ శాఖలో తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొని ఉందని ఆంధ్రప్రదేశ్ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కళ్ళేపల్లి మధుసూదన రాజు, కన్వీనర్ కోన దేవదాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

గ్రంథాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు, పెన్షన్లు సమయానికి అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కంటింజెంట్ నిధుల కొరతతో సిబ్బంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అయితే డైరెక్టర్ కార్యాలయం మాత్రం స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు.

ప్రభుత్వం విడుదల చేయాల్సిన గ్రాంట్లలో కోతలు, స్థానిక సంస్థలు చెల్లించాల్సిన సెస్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల పరిస్థితి మరింత విషమించిందన్నారు. ఫలితంగా పుస్తకాల కొనుగోలు నిలిచిపోవడం, పత్రికల బిల్లులు చెల్లించకపోవడం, పుస్తక పంపిణీ కేంద్రాలు, గ్రామీణ గ్రంథాలయాల్లో పనిచేసే సిబ్బంది, స్వీపర్లకు జీతాలు అందకపోవడం వంటి సమస్యలు తలెత్తాయని వివరించారు.

ఉద్యోగ సంఘాల ఐక్యత లోపం, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు మరింత పెరిగాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను పరిశీలిస్తే పౌర గ్రంథాలయ శాఖను నిర్జీవంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

గతంలో జిల్లా గ్రంథాలయ సంస్థలను రద్దు చేసేలా జారీ చేసిన ఉత్తర్వులను ప్రజలు, మేధావులు, ఉద్యోగ సంఘాలు వ్యతిరేకించి రద్దు చేయించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం కూడా అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పౌర గ్రంథాలయాలు ప్రజల విజ్ఞానాభివృద్ధికి ముఖ్య కేంద్రాలుగా ఉన్నాయని, వీటి ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించి తక్షణమే నిధులు విడుదల చేసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## అరణ్ములలో కుమ్మనం రాజశేఖరన్ నామినేషన్‌కు బీజేపీ భారీ సన్నాహాలు





- నామినేషన్ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్న వల్లూరు జయప్రకాష్ నారాయణ

**నేషనల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్):** కేరళ రాష్ట్రంలోని అరణ్ముల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ గవర్నర్, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కుమ్మనం రాజశేఖరన్ బరిలో దిగుతుండడంతో స్థానిక బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఆయన సోమవారం నామినేషన్ దాఖలు చేయనుండగా, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వల్లూరు జయప్రకాష్ నారాయణ భారీ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

అరణ్ముల నియోజకవర్గానికి బీజేపీ ఎన్నికల ఇంచార్జిగా వ్యవహరిస్తున్న వల్లూరు జయప్రకాష్ నారాయణ గత నెల రోజులుగా విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేశారు. నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆదివారం ఆయన కుమ్మనం రాజశేఖరన్‌తో కలిసి మండల అధ్యక్షులు, యువమోర్చా, మహిళా మోర్చా, ఓబీసీ మోర్చా నాయకులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ, అరణ్ములలో బీజేపీ విజయానికి శ్రేణులందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి చేరుకుని పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని, నామినేషన్ కార్యక్రమాన్ని ప్రజా తరంగంగా మార్చాలని సూచించారు. కుమ్మనం రాజశేఖరన్ నాయకత్వంలో అరణ్ములలో అభివృద్ధి, పారదర్శక పాలన సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ సమావేశాల్లో అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి సాజీ రాఘవన్, మండల అధ్యక్షులు దీపా నాయర్, విపిని వాసుదేవ్, అయ్యప్ప కొట్టి, పి. ఆర్. షాజీ తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో అత్యధిక కాలం సేవలందించిన ప్రభుత్వ అధినేతగా మోదీ

- మోదీ 8,931 రోజుల పాలన... చారిత్రాత్మక రికార్డు
- ఏపీ బీజేపీ రాష్ట్ర మీడియా విభాగం ఇన్‌చార్జ్ కిలారు దిలీప్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలో అత్యధిక కాలం ప్రభుత్వ అధినేతగా సేవలందించిన నాయకుడిగా నిలిచారని ఏపీ బీజేపీ రాష్ట్ర మీడియా విభాగం ఇన్‌చార్జ్ కిలారు దిలీప్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

మోదీ ఇప్పటివరకు 8,931 రోజులు ప్రభుత్వాన్ని నడిపిస్తూ, సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ చామ్లింగ్ 8,930 రోజుల రికార్డును అధిగమించారని పేర్కొన్నారు. 2014, 2019, 2024లో వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఆయన నాయకత్వానికి నిదర్శనమని అన్నారు.

సాధారణ కుటుంబం నుంచి ఎదిగి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహించడం విశేషమని, పారదర్శక రాజకీయాలు, అవినీతి రహిత పాలన, దేశ ప్రథమ విధానం ఆయన పాలనలో ప్రతిఫలించాయని తెలిపారు.

మోదీ నాయకత్వంలో బీజేపీ మూడు వరుస లోక్‌సభ విజయాలను నమోదు చేయడంతో పాటు అభివృద్ధి దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తోందన్నారు. 'వికసిత్ భారత్' లక్ష్యంతో దేశం వేగంగా అభివృద్ధి పథంలో సాగుతోందని పేర్కొన్నారు.

అంతర్జాతీయ వేదికపై భారతదేశం గ్లోబల్ సౌత్ నాయకుడిగా ఎదిగి, సాంస్కృతిక వారసత్వం, ప్రవాస భారతీయుల శక్తి, ప్రజాస్వామ్య విలువలను సాఫ్ట్ పవర్‌గా మలచుకుందని వివరించారు.

ఈ 8,931 రోజుల ప్రయాణం కేవలం ఒక రికార్డు మాత్రమే కాకుండా, స్థిరత్వం, నిష్పాక్షికత, దేశసేవ పట్ల అంకితభావానికి నిదర్శనమని కిలారు దిలీప్ అభిప్రాయపడ్డారు.

## పేద విద్యార్థులకు భోజనంపై గరికపాటి వ్యాఖ్యలు అభ్యంతరకరం

- ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం, కోడిగుడ్డు, యూనిఫారం, పుస్తకాలు వంటి వసతులు కల్పించడం అనవసరమని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఖండించింది.

ఈ మేరకు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్. చిరంజీవి సంయుక్త ప్రకటన విడుదల చేశారు. పేదరికం కారణంగా లక్షలాది మంది విద్యార్థులు బడికి దూరమవుతున్నారని, పౌష్టికాహార లోపం, విద్యా అవకాశాల లోపం వంటి అంశాలపై ప్రభుత్వ గణాంకాలు స్పష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో సుమారు 50 శాతం మందికి శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మధ్యాహ్న భోజనం, యూనిఫారం, బూట్లు వంటి సౌకర్యాలు అవసరం లేదని చెప్పడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారు ఎక్కువగా నిరుపేదలేనని గుర్తుచేశారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం వల్ల బోధనకు ఆటంకం కలుగుతోందని, మధ్యాహ్న భోజన పథక నిర్వహణ బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించడం మంచిదని సూచించారు. అలాగే, బోధనపై ప్రభావం చూపుతున్న యాప్‌ల భారం తగ్గించాలని కోరారు.

పేద విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, ఉపాధ్యాయులకు బోధనపై దృష్టి పెట్టేలా వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ రెండు అంశాలను మిళితం చేసి వ్యాఖ్యానించడం సరైంది కాదని, పేదలకు సౌకర్యాలు కల్పించకూడదనే భావన కలిగించేలా మాట్లాడటం అభ్యంతరకరమని ఏపీటీఎఫ్ నాయకత్వం స్పష్టం చేసింది.

## బీజేపీ పార్టీ బలోపేతానికి కార్య విస్తరణ, బూత్ మేనేజ్మెంట్ కీలకం




- కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు

**గుంటూరు, దుగ్గిరాల (జర్నలిస్ట్ ఫైల్ ):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ 2026 కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా దుగ్గిరాలలో ప్రశిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం మండల అధ్యక్షులు అడపా వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన 6వ కాలాంశం – కార్య విస్తరణ మరియు బూత్ మేనేజ్మెంట్, ఓటర్ లిస్ట్ ప్రత్యేక సమగ్ర సవరణ 2026 పై భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్రప్రధాన కార్యదర్శి వై. వి. సుబ్బారావు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ గ్రామ స్థాయి నుండి బలపడాలంటే కార్య విస్తరణతో పాటు బూత్ మేనేజ్మెంట్ అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి కార్యకర్త ప్రజలతో సన్నిహితంగా ఉండి పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. అలాగే ఎన్నికల విజయానికి బూత్ స్థాయిలో బలమైన కమిటీలు ఏర్పాటు చేయడం అవసరమని పేర్కొన్నారు. అదేవిధంగా ఆయన ఓటర్ లిస్ట్ ప్రత్యేక సమగ్ర సవరణ 2026 ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి కార్యకర్త తమ బూత్ పరిధిలో 18 సంవత్సరాలు పూర్తి చేసిన కొత్త ఓటర్లను నమోదు చేయడం, ఓటర్ వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయడం, మరణించిన వారి పేర్లను తొలగించడం వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సరైన ఓటరు జాబితా ఉంటేనే ఎన్నికలు పారదర్శకంగా జరిగి పార్టీకి విజయం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కాలాంశానికి సీనియర్ నాయకులు చుండూరు ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వరికూటి సుధాకర్ కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ జిల్లా కో-కన్వీనర్ మేడూరి యశ్వంత్, దుగ్గిరాల యార్డ్ డైరెక్టర్ కొంగర జోగేంద్ర ప్రసాద్, టి. శ్రీధర్, సత్యనారాయణ, బి. రాజారావు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467